విశాఖపట్టణం
మంగళవారం 7 జులై 2026

For a pure tomorrow..

# జయజయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:164 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## వృద్ధ భక్తురాలికి శ్రీవారి బ్రేక్ దర్శనం

(తిరుమల - జయజయహే)



తిరుమలలో అరుదైన ఘట్టం చోటు చేసుకుంది. 116 ఏళ్ల వృద్ధురాలు, శ్రీ వెంకటేశ్వరస్వామి భక్తురాలు నవనీతమ్మ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తమిళనాడుకు చెందిన ఆమె రెంవ్రోజుల క్రితం అలిపిరి కాలినడక మార్గంలో తిరుమలకు చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో..ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కూడా స్పందించి.. ఆమె భక్తిని కొనియాడారు. తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఛైర్మన్ బీఆర్ నాయుడు ప్రత్యేక చొరవ తీసుకుని ఆమెకు, ఆమె కుటుంబ సభ్యులకు సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించారు. టీటీడీ ఛైర్మన్ కార్యాలయ సిబ్బంది దగ్గరుండి ఆమెకు స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం బామ్మకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## ఏఐ కేపిటల్‌గా ఏపీ

పెట్టుబడులకు ప్రోత్సాహకాలు, అవకాశాలు

ఆవిష్కరణలకు వెన్నుముకగా రతన్ టాటా హబ్

మంత్రి నారా లోకేశ్ వెల్లడి

కొరియాలో రెండు రోజు పర్యటన

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

భారతదేశ ఏఐ రాజధానిగా నిలపడం ప్రభుత్వ ధ్యేయమని మంత్రి లోకేశ్ తెలిపారు. రెండోరోజు పర్యటనలో భాగంగా దక్షిణకొరియాలోని సియోల్‌లో పలు సంస్థల ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. ఏపీని ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో యూనిట్లు ఏర్పాటు చేయాలని కొరియన్ సంస్థలకు ఆహ్వానం పలికారు. ప్రభుత్వ ప్రతిపాదనలపై కొరియన్ కంపెనీలు అత్యంత సానుకూలత వ్యక్తం చేస్తూ ఏపీలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. దక్షిణకొరియాలో రెండోరోజు పర్యటనలో మంత్రి లోకేశ్ పారిశ్రామికవేత్తలతో వరుస సమావేశాలతో బిజీబిజీగా గడిపారు. దక్షిణకొరియాకు చెందిన ప్రఖ్యాత మెడికల్ డివైస్ ..మిగతా 2లో

# గిరిజన గ్రామాల్లో అన్నా క్యాంటీన్లు

మారుమూల పల్లెలకు సెల్ టవర్లు

నియోజకవర్గ స్థాయిలో లాస్ట్ మైల్ గవర్నెన్స్

ప్రతీ అంశంలో పొదుపు పాటించాలి

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు

ఆర్టీజీఎస్ పై అధికారులతో కీలక సమీక్ష





(అమరావతి - జయజయహే)

ప్రజా సమస్యలు, ఇబ్బందులపై ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి రియల్ టైమ్‌లోనే స్పందించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రియల్ టైమ్ గవర్నెన్సు కేంద్రం నుంచి రియల్ టైమ్‌లోనే ప్రజల సమస్యలు, ఇబ్బందులపై రెస్పాన్స్ అందాలని దిశానిర్దేశం చేశారు. వేగంగా స్పందించగలిగితేనే పౌరులకు మెరుగైన సేవల్ని అందించగలుగుతామని స్పష్టం చేశారు. సీఎస్ ఆధ్వర్యంలో మల్టీ డిపార్ట్మెంట్ కోఆర్డినేషన్ సమావేశం జరగాలన్నారు. విశాఖ సముద్రం తీరంలో బోటు మునిగి మత్స్యకారులు గల్లంతైన ఘటనలో తక్షణ స్పందనగా ఏఏ విభాగాలు ఎలా స్పందించాయన్నదే కీలకమని అన్నారు. ఆర్టీజీఎస్ కేంద్రం 24 గంటలూ ప్రజలకు సేవలందించేలా చర్యలు చేపట్టాలని సీఎం నిర్దేశించారు. ఐదు రోజుల జిల్లాల పర్యటన అనంతరం అమరావతికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పురపాలక, పంచాయితీరాజ్, హోం, ఎక్సైజ్ తదితర శాఖల ద్వారా అందిస్తున్న ప్రభుత్వ సేవలపై సమావేశంలో చర్చించారు. ఏఐ మెథడాలజీ ద్వారా చిత్తూరు జిల్లాలో సంతృప్తి స్థాయి నమోదు చేస్తున్నామని అన్నారు. అధికారులు క్షేత్రస్థాయి పర్యటనల వల్ల ప్రజాభిప్రాయం నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. నియోజకవర్గస్థాయిలో ..మిగతా 2లో

# బుల్లెట్ రైలు వచ్చేస్తోంది..!

వచ్చే ఏడాది ఆగస్టు 15న ప్రారంభం

ముంబై - అహ్మదాబాద్ రూట్ 80శాతం పూర్తి

దేశంలో ఏడు బుల్లెట్ రైలు కారిడార్లు

కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ వెల్లడి

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

దేశంలో బుల్లెట్ ట్రైన్ల కోసం ఎదురుచూస్తున్నవారికి సూపర్ న్యూస్. వచ్చే ఏడాదిలో దేశంలో తొలి బుల్లెట్ రైలు పట్టాలపై పరుగులు పెట్టనుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం మొదటి బుల్లెట్ రైలు ప్రారంభానికి ముహూర్తం కూడా ఫిక్స్ చేసింది. వచ్చే ఏడాది ఆగస్ట్ 15న తొలి బుల్లెట్ ట్రైన్ ప్రారంభించనున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ..మిగతా 2లో



## ఆచూకీ కోసం గాలింపు


రంగంలోకి నేవీ, కోస్టుగార్డు

ప్రతికూల వాతావరణంతో ఆటంకం

(విశాఖపట్నం - జయజయహే)



విశాఖపట్నం తీర ప్రాంతంలో మత్స్యకారుల బోట్ ఒకటి తప్పిపోయిన ఉదంతంపై ఇండియన్ కోస్ట్ గార్డ్, నేవీ, ఏపీ కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు సంయుక్తంగా ముమ్మరంగా సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్స్ నిర్వహిస్తున్నారని విశాఖ రేంజ్ ఐజీ గోపినాథ్ జెట్టి వెల్లడించారు. అయితే ఈ గాలింపునకు వాతావరణం పెద్ద అడ్డంకిగా మారింది. సముద్రంలో కోస్ట్‌గార్డ్ బోటులు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. మరోవైపు మత్స్యకారుల కోసం కుటుంబాలు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. గత 4వ తేదీ అర్ధరాత్రి 11 గంటల ప్రాంతంలో మత్స్యకార కమ్యూనిటీ నుంచి బోట్ మిస్ అయినట్లు సమాచారం అందిందని ఐజీ గోపినాథ్ జెట్టి తెలిపారు. వెంటనే స్పందించిన పోలీస్ యంత్రాంగం.. విశాఖపట్నంలోని రీజినల్ ఆపరేషన్స్ సెంటర్, రీజినల్ ఆపరేషన్స్ స్టేషన్లకు ఈమెయిల్ ద్వారా సమాచారాన్ని చేరవేసి అలర్ట్ చేశామన్నారు. ఆదివారం ఉదయం నుంచే ఇండియన్ నేవీకి చెందిన రెండు షిప్పులు, కోస్ట్ గార్డ్‌కు చెందిన రెండు షిప్పులు ..మిగతా 2లో




## మూతపడుతున్న ఇంజనీరింగ్ కాలేజీలు

దేశవ్యాప్తంగా 58 కాలేజీలు మూసివేత

వసతుల లేమి, విద్యార్థుల తగ్గడం, నిబంధనల ఉల్లంఘన తగ్గడం

క్రమంగా మూసివేసే ధోరణిలో మరిన్ని కాలేజీలు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

దేశంలో ఇంజినీరింగ్, సాంకేతిక విద్యా రంగానికి సంబంధించి ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ కీలక విషయాలను వెల్లడించింది. 2025-26 విద్యాసంవత్సరంలో దేశవ్యాప్తంగా 58 ఇంజనీరింగ్, టెక్నికల్ కాలేజీలు మూతపడ్డాయి. విద్యార్థుల సంఖ్య తగ్గడం, మౌలిక వసతుల లేమి, నిబంధనల ఉల్లంఘన వంటి వివిధ కారణాల వల్ల ఈ విద్యాసంస్థలను మూసివేయాల్సి వచ్చినట్లు ఏఐసీటీఈ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఈ విద్యాసంస్థల మూసివేత 'ప్రోగ్రెసివ్ క్లోజర్' (క్రమంగా మూసివేసే) పద్ధతిలో జరుగుతుందని అధికారులు స్పష్టం చేశారు. దీని ప్రకారం.... సదరు కాలేజీలు ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి మొదటి సంవత్సరంలో కొత్తగా ఎలాంటి అడ్మిషన్లు తీసుకోకూడదు. కానీ, ఇప్పటికే ఆయా కాలేజీల్లో చదువుతున్న పాత విద్యార్థులు తమ డిగ్రీలను ఎలాంటి అభ్యంతరం లేకుండా పూర్తి చేసుకునేందుకు అనుమతిస్తారు. భారతదేశంలో సాంకేతిక విద్య ప్రమాణాలను నియంత్రించే అత్యున్నత సంస్థ అయిన ఏఐసీటీఈ.... దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్, మేనేజ్‌మెంట్, ఫార్మసీ కోర్సులను పర్యవేక్షిస్తుంటుంది. ఈ(2025-26) విద్యాసంవత్సరంలో ..మిగతా 2లో

## పవన్ కల్యాణ్‌పై కేసు నమోదు చేయాలి

నా కుమార్తె మరణాన్ని రాజకీయంగా వాడుకున్నారు

న్యాయం చేస్తానని మోసం చేసారు

తొలి సంతకం మా కేసుపైనే అని ద్రోహం చేసారు

సుగాలి ప్రీతి తల్లి పార్వతీ దేవి డిమాండ్

పవన్ పై గన్నవరం పోలీసులకు ఫిర్యాదు

2

## యువతలో ద్వేషం నింపుతున్నాడు

హిందూ దేవుళ్లపై కించపరిచే వైఖరి

అందుకే రావణ్ అని పేరు పెట్టుకున్నాడు

మావో హిడ్మాను కీర్తిస్తూ ప్రసంగాలు

రాజ్యాగం పదవుల్లో ఉన్న వారిపై అసభ్య పదజాలం

యూట్యూబర్ రావణ్ రిమాండ్ రిపోర్టులో సంచలన అంశాలు

2

## మెటాలో ఊస్టింగ్‌లు..!

భారీగా సిబ్బందికి లేఆఫ్ లు

4, 800 మంది తొలగింపునకు నిర్ణయం

మైక్రోసాఫ్ట్ చర్యలపై సర్వత్రా ఆవేదన




2

## గోప్యంగా ఉంచాలి

మంత్రులు సమాధానం ఇచ్చేవరకు పాటించాలి

కొందరు ఆన్సర్స్ ను ముందుగానే లీక్ చేస్తున్నారు

పార్లమెంట్ లో ప్రశ్నలు, సమాధానాలపై ఆంక్షలు

ఎంపీలకు లోక్ సభ సెక్రటేరియట్ కీలక హెచ్చరిక

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

ఎంపీలకు లోక్‌సభ సెక్రటేరియట్ కీలక హెచ్చరిక జారీ చేసింది. పార్లమెంట్ ప్రశ్నల సమాధానాలపై ఆంక్షలు విధించింది. సభలో మంత్రులు సమాధానం ఇచ్చే వరకు ఆ వివరాలు 'అత్యంత గోప్యంగా' ఉంచాలని ఆదేశించింది. ప్రశ్నోత్తరాల సమయం ముగియకుండా సమాధానాలను బయటకు వెల్లడించొద్దని స్పష్టం చేసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో ఎంపీలకు ఈ నిబంధనలను గుర్తుచేసింది లోక్‌సభ సెక్రటేరియట్. లిఖితపూర్వక సమాధానాలను సభాపతి టేబుల్‌పై ఉంచే వరకు రహస్యంగా ఉంచాల్సిందేనని స్పష్టం చేసింది. సభలో మంత్రులు అధికారికంగా సమాధానం చెప్పిన తర్వాతే ఆ వివరాలను మీడియాకు లేదా ప్రజలకు తెలపాలని లోక్‌సభ సెక్రటేరియట్ సూచించింది. సభలో మంత్రులు ఇచ్చే సమాధానాల తుది రూపమే రికార్డుల్లోకి వెళ్తుందని గుర్తుచేసింది. గతంలో కొందరు ఎంపీలు సమాధానాలను ముందే మీడియాకు, సోషల్ మీడియాలో పంచుకోవడంపై సెక్రటేరియట్ సీరియస్ అయింది. లోక్‌సభలో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు, రాజ్యసభలో మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు ప్రశ్నోత్తరాల సమయాన్ని కేటాయించింది. ప్రశ్నోత్తరాల సమయం ముగిసేలోపు ఎలాంటి సమాధానాలను లీక్ చేసినా నిబంధనల ఉల్లంఘనే అవుతుందని లోక్‌సభ సెక్రటేరియట్ హెచ్చరించింది.

# పవన్ కల్యాణ్‌పై కేసు నమోదు చేయాలి

**నా కుమార్తె మరణాన్ని రాజకీయంగా వాడుకున్నారు**

**న్యాయం చేస్తానని మోసం చేసారు**

**తొలి సంతకం మా కేసుపైనే అని ద్రోహం చేసారు**

**సుగాలి ప్రీతి తల్లి పార్వతీ దేవి డిమాండ్**

**పవన్ పై గన్నవరం పోలీసులకు ఫిర్యాదు**

**(అమరావతి - జయజయహే)**

సుగాలి ప్రీతి కేసులో ఆమె తల్లి పార్వతీదేవి పోరాటం కొనసాగుతోంది. ఆమె మరోసారి ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను మరోసారి టార్గెట్ చేశారు. తన కుమార్తె మరణాన్ని రాజకీయంగా వాడుకున్నారని మండిపడ్డారు. అంతే కాకుండా న్యాయం చేస్తానని చెప్పి మోసం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై కేసు నమోదు చేయాలని సుగాలి ప్రీతి తల్లి పార్వతీదేవి గన్నవరం పోలీసులను ఆశ్రయించారు. చీటింగ్, నమ్మక ద్రోహం సహా పలు ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే మొదటి సంతకం సుగాలి ప్రీతి కేసుపైనే పెడతానని తనకు మాట ఇచ్చారని వెల్లడించారు. డిప్యూటీ సీఎం అయిన తర్వాత మాట మార్చారు అని సుగాలి పార్వతీదేవి ఆరోపించారు. తన కుమార్తె మరణాన్ని రాజకీయానికి వాడుకుని పవన్ మోసం చేశారని ఫిర్యాదులో వెల్లడించారు. పవన్ కళ్యాణ్ పై చీటింగ్ , నమ్మకద్రోహం , బహిరంగ విమర్శ, ఆదివాసీ బిడ్డ మరణంపై అసత్య ఆరోపణలు చేశారు., డబ్బులు తీసుకొని నిందితులతో కుమ్మక్కైన విధానం, మొదటి సంతకం అంటూ మోసం చేసిన తీరుపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఇచ్చిన కంప్లైంట్‌లో తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పవన్ కల్యాణ్, జనసేన నేతలపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. "డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన రాజకీయాల కోసం నా బిడ్డ మరణాన్ని వాడుకున్నారు. నా బిడ్డ మరణంపై ఒక్కోసారి ఒక్కోలా మాట్లాడుతున్నారు. ఎవరు మాట్లాడినా ఆధారాలతో మాట్లాడమని పవన్ చెబుతున్నారు. అందుకే నేను పవన్ మాట్లాడిన వీడియోల ఆధారంగానే ప్రశ్నిస్తున్నా, సుగాలి ప్రీతిని మానభంగం చేసి చంపేశారని ఓసారి మాట్లాడతారు . సుగాలి ప్రీతి కేసులో ఎలాంటి ఆధారాలు లేవని నిందితులకు క్లీన్ చిట్ ఇస్తున్నారు. అధికారంలోకి వస్తే మొదటి సంతకం సుగాలి ప్రీతి కేసు విచారణ పై చేస్తానన్నారు. అధికారంలోకి వచ్చి డిప్యూటీ సీఎం అవ్వగానే పవన్ కళ్యాణ్ మాట మార్చారు. డీఎన్ఏలు లేవు , నిందితులు లేరు , అసలు రేప్ జరగలేదు, సాక్ష్యాలు లేకపోతే ఏం చేస్తానంటున్నారు.

**న్యాయం చేసే వరకు వదిలిపెట్టం**

న్యాయం చేయమని అడిగినప్పుడల్లా తనపై ఎదురు దాడి చేస్తున్నారని సుగాలీ పార్వతీ దేవి మండిపడ్డారు. జనసేన నేతలను ఉసిగొలుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారంతా తనపై మాటల దాడులు చేస్తున్నారని గుర్తు చేశారు. "నేను నా న్యాయం చేయమని అడిగినప్పుడల్లా పవన్ కళ్యాణ్ మీడియాతో మాట్లాడతారు. జనసేన వాళ్లను ఉసిగొల్పుతారు. ఆ వెంటనే జనసేన నేతలు నా పై దాడులకు దిగుతారు. ఇప్పటికైనా పవన్ కళ్యాణ్ నాకు న్యాయం చేయాలి" అని అన్నారు. ఫిర్యాదు తీసుకునే విషయంలో పోలీస్ స్టేషన్‌లో కాసేపు గందరగోళం నెలకొంది. చివరకు సుగాలి పార్వతీ దేవి నుంచి పోలీసులు ఫిర్యాదు తీసుకున్నారు. దీంతో ఆమె అక్కడి నుంచి వెళ్లిపోయారు.

# గిరిజన గ్రామాల్లో అన్నా క్యాంటీన్లు

మొదటి పేజీ తరువాయి...

లాస్ట్ మైల్ గవర్నెన్స్ ప్రజలకు అందాలన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రజాపాలనలో పొలిటికల్ మేనేజ్మెంట్-బ్యూరోక్రటిక్ యాక్షన్ సమపాళ్లలో ఉండాలని సీఎం చంద్రబాబు తెలిపారు. పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. వివిధ కేటగిరీలు, శాఖలకు చెందిన పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి ఓ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించేలా కలెక్టర్లు, ఉన్నతాధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో మహిళలపై నేరాలు గణనీయంగా తగ్గాలని, గంజాయి ముఠాలను పూర్తిగా నియంత్రించాలన్నారు. గంజాయి నిర్మూలనపై తీసుకుంటున్న చర్యలపై సమాచారాన్ని ప్రజల్లోకి వెళ్లేలా చూడాలని చంద్రబాబు నిర్దేశించారు. కేంద్రం కూడా డ్రగ్ ఫ్రీ కంట్రీగా భారత్‌ను తయారుచేసేలా కార్యాచరణ చేపట్టిందని దానికి అనుగుణంగానే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాల ద్వారా ఎలాంటి ఫలితాలు సాధిస్తున్నామో అన్న అంశాన్ని కూడా ఎప్పటికప్పుడు విశ్లేషించాలని సీఎం అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో తాగునీరు, వ్యర్థాల సేకరణకు స్వచ్ఛ రథాలు, ఇంటింటికీ చెత్త సేకరణ లాంటి అంశాల్లో నిర్దిష్టమైన ఎస్ఓపీ జారీ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పేరుకున్న 23 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను మూడు నెలల్లోగా తొలగించాలని దీనిపై ప్రజాప్రతినిధులు కూడా శ్రద్ధ పెట్టాలని సూచించారు. జీరో వేస్ట్ మున్సిపల్ ప్రాంతాలు మన లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, పీజీఆర్ఎస్ ద్వారా వస్తున్న దరఖాస్తులను ఆర్థిక, ఆర్థికేతర కేటగిరీలుగా విభజించి పరిష్కారం చూపాలని సీఎం స్పష్టం చేశారు. ఈ విషయంలో కలెక్టర్లు అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. వివిధ సమస్యల్ని ఎదుర్కొనేలా ఇతర ప్రాంతాల్లో అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను అనుసరించటంతో పాటు ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతీ అంశంలోనూ పొదుపు మంత్రం పాటించాలని సీఎం నిర్దేశించారు. నెలరోజుల్లోగా అన్ని ప్రభుత్వ శాఖలూ అవేర్ 2.0 ద్వారా ఏమేరకు ఫలితాలు వచ్చాయో విశ్లేషించాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనికేషన్ నెట్వర్క్ కనెక్టివిటీ కోసం మారుమూల ప్రాంతాల్లో టవర్లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ చేపట్టాలన్నారు. ఆపరేటర్లను సంప్రదించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్షకు మంత్రి కొలుసు పార్థసారథి, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, పురపాలక, ఎక్సైజ్, పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# యువతలో ద్వేషం నింపుతున్నాడు

**(అమరావతి - జయజయహే)**

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన యూట్యూబర్ ప్రశ్న రావణ్(బచ్చలకూరి జోసెఫ్) అరెస్ట్ వ్యవహారంలో గన్నవరం పోలీసులు న్యాయస్థానానికి సమర్పించిన రిమాండ్ రిపోర్ట్‌లో పలు కీలక అంశాలను వెల్లడించారు. సమాజంలో అశాంతిని రేకెత్తించడం, యువతను తప్పుదోవ పట్టించడమే లక్ష్యంగా నిందితుడు వ్యవహరిస్తున్నాడని పోలీసులు పేర్కొన్నారు. ఇప్పటికే అతనిపై ఆంధ్రప్రదేశ్‌లో పలు క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయి. పోలీసుల నివేదిక ప్రకారం.. దేశంలో నిషేధించిన మావోయిస్టు తీవ్రవాద సంస్థల వైపు విద్యార్థులను, యువకులను ఆకర్షించేలా జోసెఫ్ సోషల్ మీడియా వేదికగా వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నాడు. ఇటీవల ఏలూరు నగరంలో నిర్వహించిన దళిత క్రైస్తవ సభలో ఆయన చేసిన ప్రసంగం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసేలా ఉందని పోలీసులు స్పష్టం చేశారు. రాజ్యాంగబద్ధమైన ఉన్నత పదవుల్లో ఉన్న ప్రజాప్రతినిధులను, ప్రభుత్వ వ్యవస్థలను అత్యంత అసభ్య పదజాలంతో దూషిస్తూ ప్రజల్లో ద్వేషాన్ని పెంచేందుకు ప్రయత్నించినట్లు రిపోర్ట్‌లో వివరించారు. నిందితుడి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని పరిశీలించగా, అందులో మావోయిస్టు సిద్ధాంతాలకు సంబంధించిన కీలక సమాచారం లభ్యమైంది. మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు కమాండర్ హిడ్మాను గొప్పగా కీర్తిస్తూ ఆయన ప్రసంగాలు చేశాడని, సమాజంలో మతపరమైన చిచ్చు పెట్టడమే ధ్యేయంగా అవాకులు చవాకులు పేలుతున్నాడని పోలీసులు తెలిపారు. హిందూ దేవుళ్లను కించపరిచే ఉద్దేశంతోనే రావణ్ అనే పేరును పెట్టుకున్నాడని.. అయితే ప్రస్తుతం దర్యాప్తుకు నిందితుడు ఏమాత్రం సహకరించడం లేదని, అతని వెనుక ఉన్న సూత్రధారుల వివరాలు సేకరించాల్సి ఉందని పోలీసులు వెల్లడించారు. గన్నవరానికి చెందిన జనసేన పార్టీ లీడర్ గరికపాటి శివశంకర్ ఇచ్చిన అధికారిక ఫిర్యాదు ఆధారంగానే పోలీసులు శనివారం అర్ధరాత్రి జోసెఫ్‌ను అదుపులోకి తీసుకున్నారు. సాయుధ పోరాటాన్ని ప్రేరేపించడం, దేశ సార్వభౌమాధికారానికి, ఐక్యతకు ముప్పు వాటిల్లేలా వ్యవహరించినందుకు గాను భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 152తో పాటు, కఠినమైన ఉపా ( - చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం) కింద కేసులు నమోదు చేశారు. కాగా ఆదివారం సాయంత్రం నిందితుడిని మెజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టగా కోర్టు ఈ నెల 18వ తేదీ వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు ఈ ఘటనపై సోషల్ మీడియాలో ఓ పెద్ద యుద్ధమే జరుగుతోంది. రెండు వర్గాలుగా కొందరు నెటిజన్లు విడిపోయారు. ఫేస్‌బుక్‌లో పోస్టులు పెడుతున్నారు. రావణ్‌పై ఉపా ప్రయోగించడం దారుణం అని, ప్రశ్నించేవారి గొంతు నొక్కడమేనని కొందరు మాట్లాడుతున్నారు. మరికొందరేమో రావణ్‌కు వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారు. భావప్రకటన స్వేచ్ఛ పరిధి దాటితే ఇలాంటివే జరుగుతాయని చెబుతున్నారు.

# బుల్లెట్ రైలు వచ్చేస్తోంది..!

మొదటి పేజీ తరువాయి...

ప్రకటించారు. ముంబై-అహ్మదాబాద్ హైస్పీడ్ బులట్‌ల్ రైలు కారిడార్‌లో ఈ రైలు ప్రవేశపెట్టనున్నారు. ఈ కారిడార్ పనులు ఎన్నో ఏళ్ల నుంచి కొనసాగుతుండగా.. ప్రస్తుతం 80 శాతం పూర్తయినట్లు అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో సూరత్-బిలిమోరా మధ్య తొలి రైలు పరుగులు తీయనుంది. 2027 ఆగస్టు 15న ప్రారంభం కానుందని అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ఈ కారిడార్ పనులు వేగంగా జరుగుతున్నాయని, మిగతా కారిడార్ల పనులు దశలవారీగా ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. 2027లో సూరత్-బిలిమోరా సెక్షన్ మొదటగా ప్రారంభించబడుతుందని అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ మార్గంలో 2027 ఆగస్టు 15న తొలిసారిగా రైళ్లు నడవడం ప్రారంభిస్తాయని, ఆ తర్వాత ఇతర సెక్షన్లు ఒక్కొక్కటిగా ప్రారంభించబడతాయని చెప్పారు. బుల్లెట్ రైలు ప్రాజెక్టును పలు దశల్లో ప్రారంభించనున్నామని అన్నారు. సూరత్-బిలిమోరా సెక్షన్ ప్రారంభించాక.. వాపి-సూరత్ ప్రారంభమవుతుందన్నారు. ఆ తర్వాత వాపి-అహ్మదాబాద్, అహ్మదాబాద్-థానే మార్గాలు మొదలవుతాయన్నారు. చివరగా అహ్మదాబాద్-ముంబై సెక్షన్‌లను ప్రారంభిస్తామని అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. ఈ కారిడార్ మొత్తం 508 కిలోమీటర్లు ఉంటుంది. డిసెంబర్ 2029 నాటికి ఈ కారిడార్ పనులన్నీ పూర్తై పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.

**దేశంలో ఏడు బుల్లెట్ రైలు కారిడార్లు**

ేశంలో మొత్తం ఏడు బుల్లెట్ రైళ్ల కారిడార్లను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. తొలుత ముంబై-అహ్మదాబాద్ కారిడార్ ప్రారంభం కానుంది. అనంతరం మిగతా కారిడార్ల పనులు స్టార్ట్ కానున్నాయి. అటు సెమీకండక్టర్ల తయారీ రంగంలో కూడా భారతదేశం వేగంగా పురోగమిస్తోందని అశ్విని వైష్ణవ్ అన్నారు. జూలై 4న ఆనంద్‌లో ప్రధాని మోదీ దేశంలోని మూడో సెమీకండక్టర్ ప్లాంట్‌ను ప్రారంభించారని అన్నారు. మొదటి ప్లాంట్‌ను ఫిబ్రవరి 28న ప్రారంభించగా.. రెండవ ప్లాంట్‌ను మార్చి 31న ప్రారంభిస్తారు. సెమీకండక్టర్ల తయారీలో దేశాన్ని స్వయం సమృద్ధిగా మార్చడంలో భాగంగా ఇది ఒక ప్రధాన ముందడుగుగా చెబుతున్నారు.

# ఆచూకీ కోసం గాలింపు

మొదటి పేజీ తరువాయి...

రంగంలోకి దిగి బోట్ మిస్సయిన ప్రాంతంలో గాలింపు చర్యలు ప్రారంభించాయని పేర్కొన్నారు. వీటితోపాటు కోస్ట్ గార్డ్‌కు చెందిన డోర్నియర్ ఎయిర్‌క్రాఫ్ట్, నేవీ హెలికాప్టర్ కూడా నిన్నటి నుంచి నిరంతరాయంగా ఆపరేషన్‌లో పాల్గొంటున్నాయని ఐజీ వివరించారు. ప్రమాదానికి గురైన బోటులో మొత్తం ఏడుగురు మత్స్యకారులు ఉన్నట్లు సమాచారం కాగా, వారిలో 'కర్రి చిన్న' అనే ఒక మత్స్యకారుడిని ఆదివారం ఉదయం 7:30 గంటల ప్రాంతంలో పనామా రిజిస్ట్రేషన్ కలిగిన 'యూనివర్స్ వెల్త్' అనే మర్చంట్ వెజిల్ సురక్షితంగా రక్షించిందని ఐజీ గోపినాథ్ జెట్టి తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆ నౌకలోనే సురక్షితంగా ఉన్నారని, అతడిని ఒడ్డుకు తీసుకురావడానికి నిన్నటి నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు.

**రెస్క్యూ ఆపరేషన్‌కు వాతావరణం ఆటంకం**

సముద్రంలో అలల తీవ్రత ఎక్కువగా ఉండటం, దాదాపు 4 మీటర్ల ఎత్తు వరకు అలలు ఎగసిపడుతుండటం వల్ల రెస్క్యూ ఆపరేషన్‌కు కొంత ఆటంకం కలుగుతోందని ఐజీ పేర్కొన్నారు. కోస్ట్ గార్డ్ లేదా నేవీ షిప్పులు ఆ మర్చంట్ వెజిల్ దగ్గరకు వెళ్తే ఒకదానికొకటి ఢీకొనే ప్రమాదం ఉందని, పైగా గాలి వేగం కూడా గంటకు 50 కిలోమీటర్ల మేర ఉండటంతో హెలికాప్టర్ ద్వారా కూడా రక్షించడం ప్రస్తుతానికి రిస్క్‌తో కూడుకున్న పని అని వివరించారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ, కోస్ట్ గార్డ్, నేవీ అధికారులు తదుపరి రెస్క్యూ ప్లాన్ చేస్తున్నారన్నారు. తాము కూడా పర్సనల్‌గా రేంజ్ ఐజీ కార్యాలయం నుంచి ఎస్పీ కోస్టల్ సెక్యూరిటీ, ఇతర ఉన్నతాధికారులతో కలిసి రెస్క్యూ ఆపరేషన్‌ను నిరంతరం సమీక్షిస్తున్నామని చెప్పారు. అన్ని శాఖల స్టేక్‌హోల్డర్స్‌తో కోఆర్డినేట్ చేసుకుంటూ ఆపరేషన్ కొనసాగిస్తున్నామని, సదరు మత్స్యకారుడిని సురక్షితంగా విశాఖ తీరానికి తీసుకురావడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని ఐజీ గోపినాథ్ జెట్టి స్పష్టం చేశారు. గల్లంతైన మత్స్యకారుల కోసం కుటుంబ సభ్యులు ఆశగా ఎదురు చూస్తున్నారు. తమ వారిని సురక్షితంగా తీసుకురావాలని అధికారులకు రిక్వెస్ట్ చేస్తున్నారు. ఇప్పుడు వేటకు వెళ్లిన వాళ్లే తమ కుటుంబాలకు ఆధారమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేట బాగా జరిగింది వచ్చేస్తున్నామని చెప్పిన కాసేపటికే వారి ఫోన్‌లు స్విచ్ఛాఫ్ అయ్యాయని బాధిత కుటుంబాలు బోరుమంటున్నాయి.

# మూతపడుతున్న ఇంజనీరింగ్ కాలేజీలు

మొదటి పేజీ తరువాయి...

మూతపడిన 58 విద్యాసంస్థల్లో అత్యధికంగా ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి 12 చొప్పున కాలేజీలు ఉన్నాయి. ఆ తర్వాత మధ్యప్రదేశ్‌లో 8 విద్యాసంస్థలు మూతపడ్డాయి. తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే.... తెలంగాణలో 4 ఇంజినీరింగ్ కాలేజీలు, ఆంధ్రప్రదేశ్‌లో 3 కాలేజీలు మూసివేతకు గురయ్యాయి. ఈ 58 విద్యాసంస్థలలో కేవలం 3 కాలేజీలు మాత్రమే ప్రభుత్వ ఎయిడెడ్ సంస్థలు కాగా.... మిగిలినవన్నీ ప్రైవేట్ యాజమాన్యాల ఆధ్వర్యంలో నడుస్తున్నవే కావడం గమనార్హం. కేవలం కాలేజీలే కాకుండా, దేశవ్యాప్తంగా ఉన్న వివిధ సాంకేతిక, ఇంజనీరింగ్ కాలేజీల్లో డిమాండ్ లేని దాదాపు 950 కి పైగా కోర్సులను కూడా ఈ కాలంలో పూర్తిగా నిలిపివేసినట్లు ఏఐసీటీఈ అధికారి వెల్లడించారు.

**మూసివేతకు ప్రధాన కారణాలు**

విద్యార్థుల అడ్మిషన్లు ఆశించిన స్థాయిలో లేకపోవడం ప్రధాన కారణం. అంతేకాకుండా నిబంధనల ప్రకారం ఫ్యాకల్టీని (బోధనా సిబ్బందిని) కొనసాగించలేకపోవడం, మౌలిక సదుపాయాల కొరత మరియు కార్యాచరణ నిబంధనలను పాటించకపోవడం వంటి కారణాల వల్లే ఏఐసీటీఈ ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. సాధారణంగా ఏఐసీటీఈ రెండు పద్ధతుల్లో కాలేజీలను మూసివేస్తుంది. మొదటిది 'ప్రోగ్రెసివ్ క్లోజర్' - ఇందులో పాత విద్యార్థుల చదువుకు ఇబ్బంది లేకుండా కోర్సులు పూర్తయ్యాక కాలేజీని మూసివేస్తారు. రెండోది 'కంప్లీట్ క్లోజర్' - ఇందులో కాలేజీలను తక్షణమే పూర్తిగా మూసివేసి.... అక్కడ చదువుతున్న విద్యార్థులను వేరే కాలేజీలకు బదిలీ చేస్తారు. ప్రస్తుతం మూతపడిన సంస్థలకు ప్రోగ్రెసివ్ క్లోజర్ వర్తిస్తుందని అధికారులు స్పష్టం చేశారు.

**మిగిలిన రాష్ట్రాల వివరాలు:**

పంజాబ్: 4 కాలేజీలు
రాజస్థాన్: 3 కాలేజీలు
గుజరాత్, కర్ణాటక, పుణె, తమిళనాడు: రెండేసి చొప్పున కాలేజీలు
హర్యానా, ఒడిశా, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్: ఒక్కో కాలేజీ చొప్పున మూతపడ్డాయి.




# మెటాలో ఊస్టింగ్‌లు..!

**భారీగా సిబ్బందికి లేఆఫ్ లు**

**4, 800 మంది తొలగింపునకు నిర్ణయం**

**మైక్రోసాఫ్ట్ చర్యలపై సర్వత్రా ఆవేదన**

**(ప్రత్యేకప్రతినిధి - జయజయహే)**

గ్లోబల్ గేమింగ్ పరిశ్రమ చరిత్రలోనే అత్యంత భారీ లేఆఫ్స్ సైకిల్‌కు మైక్రోసాఫ్ట్ తెరలేపింది. సిఎన్‌బిసి నివేదిక ప్రకారం, సోమవారం నాడు మైక్రోసాఫ్ట్ సంస్థ తన మొత్తం సిబ్బందిలో 2.1% మందిని, అంటే 4,800 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విప్లవం నేపథ్యంలో ఖర్చులను అదుపు చేయడమే లక్ష్యంగా మైక్రోసాఫ్ట్ ఈ చర్యలకు పూనుకుంది. ఈ నిర్ణయం వల్ల ఎక్స్‌బాక్స్ డివిజన్ తన మొత్తం సిబ్బందిలో ఐదింట ఒక వంతు (20%) మందిని కోల్పోతోంది. మైక్రోసాఫ్ట్ చీఫ్ పీపుల్ ఆఫీసర్ ఆమీ కోల్‌మన్ ఉద్యోగులకు పంపిన అంతర్గత సందేశంలో.. "సాంకేతికతను రూపొందించే, విస్తరించే, ఉపయోగించే విధానం నేను ఇక్కడ ఉన్న 27 ఏళ్ల కాలంలో ఎన్నడూ లేనంత వేగంగా రూపాంతరం చెందుతోంది. ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం ఎప్పుడూ సులభం కాదు" అని పేర్కొన్నారు. ఎక్స్‌బాక్స్ సీఈఓ ఆశా శర్మ పంపిన అధికారిక ఈమెయిల్ ప్రకారం.. 2027 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఈ విభాగం నుండి మొత్తం 3,200 మందిని తొలగించనున్నారు. ఇందులో భాగంగా 1,600 మందిని సోమవారమే విధుల నుండి తప్పించారు. మిగిలిన 1600 మందిని తరువాత తప్పించనున్నారు. "సంవత్సరం పొడవునా జరిగే ఈ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ అదనపు సవాళ్లను సృష్టిస్తుందని నాకు తెలుసు. కానీ దురదృష్టవశాత్తూ, అవసరమైన అన్ని మార్పులను ఒకే రోజులో చేయడం సాధ్యం కాదు. అయితే 2027 లో మేం మళ్లీ బలమైన వృద్ధి పథంలోకి వస్తాం" అని ఆశా శర్మ ధీమా వ్యక్తం చేశారు. మైక్రోసాఫ్ట్ తీసుకున్న ఈ భారీ పునర్వ్యవస్థీకరణ నిర్ణయం వల్ల గేమింగ్ పరిశ్రమలో ఎంతో పేరుగాంచిన మధ్య శ్రేణి స్టూడియోలు, రాబోయే క్రేజీ గేమ్స్ తీవ్రంగా ప్రభావితం కానున్నాయి. 'హెల్‌బ్లేడ్' సిరీస్ వెనుక ఉన్న ఈ కేంబ్రిడ్జ్ ఆధారిత డెవలపర్ స్టూడియోను మూసివేస్తున్నట్లు జూన్ 15నే సమాచారం ఇచ్చారు. ఎక్స్‌బాక్స్ గేమ్స్ షోకేస్‌లో తమ సరికొత్త గేమ్‌ను ప్రెజెంట్ చేసిన కేవలం తొమ్మిది రోజులకే ఈ నిర్ణయం రావడం గమనార్హం. కంపల్షన్ గేమ్స్, డబుల్ ఫైన్ ప్రొడక్షన్స్: 'సౌత్ ఆఫ్ మిడ్‌నైట్', 'వి హ్యాపీ ఫ్యూ' వంటి ప్రసిద్ధ గేమ్స్ అందించిన మోంట్రియల్ స్టూడియో, శాన్ ఫ్రాన్సిస్కోకు చెందిన డెవలపర్ సంస్థలు ప్రస్తుతం మూసివేత లేదా బైఅవుట్ (కొనుగోలు) చర్చల్లో ఉన్నాయి. గేమర్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'స్టేట్ ఆఫ్ డికే 3' గేమ్‌ను డెవలప్ చేస్తున్న ఈ స్టూడియో (సుమారు 110 మంది సిబ్బంది) ప్రస్తుతం కార్పొరేట్ రివ్యూలో ఉంది. ఆర్కేన్ లియాన్: 'డిస్‌హానర్డ్ , 'డెత్‌లూప్' వంటి సూపర్ హిట్ గేమ్‌లను అందించిన ఈ ప్రఖ్యాత స్టూడియో కూడా మూతపడే దశలో ఉంది. దీనివల్ల, ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న సూపర్ హీరో యాక్షన్ గేమ్ 'మార్వెల్స్ బ్లేడ్' పూర్తిగా రద్దయ్యే ప్రమాదం పొంచి ఉంది.

# ఏఐ కేపిటల్‌గా ఏపీ

మొదటి పేజీ తరువాయి...

సర్టిఫైడ్ స్మార్ట్ హెల్త్‌కేర్ ఫుట్‌వేర్ సంస్థ షూఆల్స్ కంపెనీ లిమిటెడ్ ఛైర్మన్, సీఈవో లీ చియాంగ్-గెన్‌తో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. షూఆల్స్ సంస్థ ప్రభుత్వంతో చేసుకున్న ఎంవోయూ మేరకు ఏపీలో పాదరక్షల తయారీ యూనిట్ పనులను వేగంగా ప్రారంభించాల్సిందిగా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. రూ. 300 కోట్లతో ఏర్పాటు కానున్న ఈ యూనిట్ ద్వారా సుమారు 3 వేల మందికి ఉపాధి లభించనుందని తెలిపారు. ఏపీలో ఆర్ అండ్ డీ, ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేసి, ఏపీని రిటైల్, డిస్ట్రిబ్యూషన్ హబ్‌గా మార్చాలని కోరారు. దక్షిణ కొరియాకు చెందిన ఎలక్ట్రానిక్ షెల్ఫ్ లేబుల్స్, ఐఓటీ, పవర్ ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ సోలమ్ గ్రూప్ గ్లోబల్ ఆపరేషన్స్ ఆఫీసర్ జీగాబ్‌తో లోకేశ్ భేటీ అయ్యారు. శ్రీసిటీలో రూ. 338 కోట్లతో ఈవీ ఛార్జర్ పవర్ మాడ్యూల్స్, ఆటోమోటివ్ ఎలక్ట్రానిక్స్ యూనిట్ పనులు త్వరగా పూర్తిచేసి ఉత్పత్తి ప్రారంభించాలని కోరారు. శ్రీసిటీ యూనిట్‌లో ఎలక్ట్రానిక్ షెల్ఫ్ లేబుల్స్, ఇతర డిస్‌ప్లే సంబంధిత ఉత్పత్తుల తయారీ కార్యకలాపాలు విస్తరించాలని సోలమ్ సంస్థ సీఈవోకు విజ్ఞప్తి చేశారు. సాధ్యమైనంత త్వరగా శ్రీసిటీ యూనిట్ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని సీఈవో చెప్పారు. భారత్‌లోని కంపెనీలతో భాగస్వామ్యం కుదుర్చుకుని ఏపీలో మైక్రో ఎల్ఈడీ డిస్ ప్లే-మెటీరియల్ హబ్ ఏర్పాటు చేయాలని "సాఫ్ట్ - ఈపీఐ" కంపెనీ ప్రతినిధులను లోకేశ్ కోరారు. తిరుపతి ఐఐటీ సహకారంతో మైక్రో ఎల్ఈడీల్లో ఏటా 500 మంది టెక్నీషియన్లకు శిక్షణ ఇచ్చే అకాడమీ ఏర్పాటు చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణల వెన్నెముకగా ఉన్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా "వన్ ఫ్యామిలీ, వన్ ఎంటర్ ప్రెన్యూర్ నినాదంతో ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లు, లక్ష ఉద్యోగాలను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. అమరావతిలో ప్రధాన కేంద్రంగా పని చేస్తున్న ఆర్‌టీఐహెచ్ విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, అనంతపురం ప్రాంతీయ శాఖలతో పనిచేస్తోందన్నారు. సియోల్ బిజినెస్ ఏజెన్సీ కొరియన్ టెక్ స్టార్టప్‌లతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో లోకేశ్ మాట్లాడారు. ఆర్‌టీఐహెచ్ ఫుల్ లైఫ్ సైకిల్ ప్రోగ్రామ్స్ స్పార్క్, క్యాటలిస్ట్, వెలాసిటీ ల్యాబ్‌ల్లోకి కొరియన్ స్టార్టప్‌లకు ఆహ్వానం పలుకుతున్నామన్నారు. ఆర్‌టీఐహెచ్‌ను కేంద్రంగా చేసుకుని ఇండియా-కొరియా స్టార్టప్ కారిడార్ ఏర్పాటు కోసం కలిసి పని చేద్దామని కొరియన్ సంస్థలను ఆహ్వానిస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. ప్రత్యేక కొరియా డెస్క్, సాఫ్ట్-ల్యాండింగ్ "విసి బే", కొరియన్ ఏజెన్సీలతో సహ-ఇంక్యుబేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. దీనిద్వారా రెండువైపులా మార్కెట్ ప్రవేశం లభిస్తుందన్నారు. కొరియన్ స్టార్టప్‌లు భారతదేశంలోని టైర్ 2--3 మార్కెట్లలోకి, ఏపీ స్టార్టప్‌లు కొరియాలోకి రావడం సులభతరమవుతుందన్నారు. ఏపీని భారతదేశ ఏఐ రాజధానిగా నిలపడం తమ ధ్యేయమని లోకేశ్ వెల్లడించారు. హ్యోసంగ్ హెవీ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ పవర్ సిస్టమ్స్ పీయూ ప్రెసిడెంట్ యోకోటా తకేషితో సంస్థ ప్రధాన కార్యాలయంలో లోకేశ్ భేటీ అయ్యారు. రాష్ట్రంలో పారిశ్రామిక అవసరాల కోసం విద్యుత్ మౌలిక సదుపాయాల విస్తరణ నేపథ్యంలో, విద్యుత్ పరికరాలకు భారీ డిమాండ్ ఉందన్నారు. తిరుపతి లేదా శ్రీసిటీ సమీపంలో స్విచ్‌గేర్లు, ఇతర విద్యుత్ పరికరాల తయారీ లేదా అసెంబ్లింగ్ యూనిట్ ఏర్పాటు చేయాల్సిందిగా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. సియోల్ సెమీ కండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ తాయెహ్యూంగ్ లీతో లోకేశ్ భేటీ అయారు. శ్రీసిటీ లేదా దాని పరిసర ప్రాంతాల్లో సియోల్ సెమీ కండక్టర్స్ సంస్థ డిస్‌ప్లే ఫ్యాబ్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. భారత్‌లో నేరుగా లేదా జాయింట్ వెంచర్ ద్వారా పెట్టుబడి ప్రణాళికలు ఉన్నాయని తాయెహ్యూంగ్ లీ అన్నారు.

# మానవ వ్యర్థాల అక్రమ డంపింగ్‌పై

# ‘జనతా వారధి’ సమరశంఖం

## కలెక్టరుకు వినతి

**రాజమహేంద్రవరం జయ జయహే :జులై 6:**

రాష్ట్రవ్యాప్తంగా సెప్టిక్ ట్యాంకుల నుంచి సేకరిస్తున్న మానవ మలమూత్ర వ్యర్థాలను అశాస్త్రీయంగా, అక్రమంగా బహిరంగ ప్రదేశాల్లో పారబోస్తున్న వైనంపై భారతీయ జనతా పార్టీ ‘జనతా వారధి’ బృందం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ప్రమాదకర ధోరణిని అరికట్టాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్ రెవెన్యూ క్లినిక్‌లో కలెక్టరుకు వినతి పత్రం సమర్పించారు.కలెక్టరేట్‌కు వెళ్లే ముందు జనతా వారధి బృందం సభ్యులు క్వారీ ఏరియాలో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. అక్కడ పెద్ద ఎత్తున మానవ వ్యర్థాలను అక్రమంగా పారబోయడాన్ని గమనించి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జనతా వారధి కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వెళ్తున్న క్రమంలో, పారిశుధ్య నిర్వహణలో తీవ్ర లోపాలు ఉన్నట్లు గుర్తించామని వారు తెలిపారు. జిల్లాల వారీగా ఉన్న ఎఫ్ఎస్టీపి ఎస్టీపి ల వాస్తవ శుద్ధి సామర్థ్యాన్ని సమీక్షించాలి. వ్యర్థాల సేకరణకు అనుగుణంగా ప్లాంట్ల సామర్థ్యాన్ని పెంచాలి. వ్యర్థాలను తరలించే మున్సిపల్ ప్రైవేట్ వాహనాలన్నింటికీ తప్పనిసరిగా జిపిఎస్ ( ట్రాకింగ్ ఏర్పాటు చేసి, అవి ఎక్కడ డంప్ చేస్తున్నాయో పర్యవేక్షించాలి. కాలుష్య నియంత్రణ మండలి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, గ్రామీణాభివృద్ధి శాఖల సమన్వయంతో ప్రత్యేక టాస్క్



ఫోర్స్ ఏర్పాటు చేయాలి.ప్రతి మున్సిపాలిటీ, మండల స్థాయిలో వ్యర్థాల శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ప్రధాని నరేంద్ర మోదీ స్వచ్ఛ భారత్ మిషన్ మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలి.రాత్రి వేళల్లో నదులు, చెరువులు, కాలువలు మరియు జనావాసాల సమీపంలో ఈ వ్యర్థాలను పారబోయడం వల్ల భూగర్భ జలాలు కలుషితమై ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అటల్ బిహారీ వాజపేయి ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల గౌరవం కోసం తీసుకువచ్చిన చట్టాలను, ప్రస్తుత నిబంధనలను అధికారులు గాలికొదిలేశారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో జనతా వారధి రాష్ట్ర కో-కన్వీనర్ రంగుల గోపి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర, జిల్లా జట్టు సభ్యులు కృష్ణంరాజు, యానాపు యేసు, సూర్యకిరణ్, మీనాక్షి, పార్టీ నాయకులు రవికుమార్, సాయి, నాగదేవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



## జంతువుల సంరక్షణతోనే ప్రజారోగ్యం
## ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం :జయ జాయిహే : జూలై 6**

జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల (జూనోసిస్) పట్ల ప్రజల్లో అవగాహన పెంచడం, మూగజీవాలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ బాధ్యతని రాజమహేంద్రవరం సిటి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా దేవిచౌక్ సమీపంలోని ఏరియా వెటర్నరీ ఆసుపత్రిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూనోసిస్ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించి, రేబిస్ నిరోధక వ్యాక్సిన్ వేశారు.జంతువులను ప్రేమగా చూసుకోవడంతో పాటు, వాటి ద్వారా సంక్రమించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రాణాంతక రేబిస్ నివారణకు వ్యాక్సినేషన్ ఒక్కటే మార్గమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.గతంలో ఎక్స్‌రే, స్కానింగ్ కోసం విజయవాడ వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం సుమారు రూ.57 లక్షల సిఎస్ఆర్ నిధులతో ఆసుపత్రిలో అత్యాధునిక ఎక్స్‌రే, స్కానింగ్ పరికరాలను అందుబాటులోకి తెచ్చామన్నారు.కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ఆధునిక ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. రాజమహేంద్రవరం వెటర్నరీ ఆసుపత్రిలో జంతువులతో పాటు మనుషులకు కూడా రేబిస్ వ్యాక్సిన్ వేయడం విశేషమని కొనియాడారు.మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌లో యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్, కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని, మౌలిక సదుపాయాలు మెరుగుపరిచామని తెలిపారు.ఆసుపత్రి అభివృద్ధికి సహకరించిన ఆదిరెడ్డి అప్పారావు, అబ్బూ, ఎస్‌బీ గ్రూప్‌కు చెందిన రంగప్రసాద్, రాము, సురేష్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మజ్జి రాంబాబు, అబ్బు, వెటర్నరీ వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, కూటమి నాయకులు, జంతు ప్రేమికులు మరియు దాతలు పాల్గొన్నారు.

## వేరుశనగ రైతులకు శిక్షణ..

### -సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై అవగాహన..

**కొయ్యురు : (జయ జయహే ) న్యూస్ జులై 07,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం నల్లగొండ పంచాయతీ పరిధిలో వేరుశనగ రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ శిక్షణలో రైతులకు సేంద్రియ వ్యవసాయం, సమగ్ర పంటల యాజమాన్యం, నూతన ఎరువుల పంపిణీ కార్యక్రమం గురించి వివరించారు. పోషక యాజమాన్య పద్ధతులతో పంటల దిగుబడులు పెంచుకునే మార్గాలను నిపుణులు రైతులకు తెలియజేశారు.వ్యవసాయ సమాచార యాప్ ఉపయోగాలను రైతులకు వివరించారు. ప్రతి రైతు తమ పంటను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. దీని ద్వారా ప్రభుత్వ పథకాలు సకాలంలో రైతులకు అందుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి శివ రామ ప్రసాద్, మండల విస్తరణ అధికారి సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి అప్పారావు మరియు గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.నూనె గింజల సాగులో లాభాలు పెంచుకోవడానికి శాస్త్రీయ పద్ధతులు పాటించాలని, సేంద్రియ ఎరువులు వాడాలని అధికారులు రైతులకు సూచించారు.







## ఘనంగా
## శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి

**విశాఖపట్నం (జయ జయహే)**


జాతీయవాది డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు మేరా యువ భారత్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. గీతం డీమ్డ్ యూనివర్సిటీలో సోమవారం డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి వేడుకలను మై భారత నిర్వహించింది. ఆ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ జి.మహేశ్వర రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో గీతం డీమ్డ్ యూనివర్సిటీ ఎన్.ఎస్.ఎస్ అధికారి ఎస్.వి జి.రెడ్డి, నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ ఇండియా జర్నలిజం స్కూల్ చైర్మన్ ఎన్.నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ జాతి సమైక్యతకు జాతీయ వాదానికి శ్యాం ప్రకాష్ ముఖర్జీ చేసిన సేవలను గుర్తు చేశారు. బెంగాల్ విభజన సమయంలో, కాశ్మీర్ స్వయం ప్రతిపత్తి విషయంలోనూ శ్యాం ప్రసాద్ ముఖర్జీ చేసిన ప్రయత్నాలను ఆయన వివరించారు .అతి చిన్న వయసులో కలకత్తా విశ్వ విద్యాలయానికి ఉప కులపతి అయ్యారని అన్నారు. నేటి యువతకు శ్యాం ప్రసాద్ ముఖర్జీ దిక్సూచి వంటి వారని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముందుగా యువతీ యువకులు శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రద్దీపన చేశారు.



## బాబూ జగ్జీవన్ రామ్‌కు
## ఘన నివాళి

**పెదగంట్యాడ:-(జయ జయహే)**

స్వాతంత్ర్య సమరయోధుడు,మాజీ ఉప ప్రధానమంత్రి, సామాజిక న్యాయం కోసం విశేషంగా కృషి చేసిన నాయకుడు జగజ్జీవన్ రామ్ వర్ధంతి వేడుకలు పలు చోట్ల ఘనంగా జరిగాయి.పెద గంట్యాడ 76 వ వార్డు జగజ్జీవన్ రామ్ కోలనీలో ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి కొల్లి మనోహర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జగజ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ దేశ నిర్మాణంలో,సామాజిక సమానత్వం సాధనలో చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సమానత్వం, సామాజిక న్యాయం సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల ఇన్చార్ జీలకర్ర భువనేశ్వరి,మండల అధ్యక్షురాలు వి.అనిత,గూటూరు శంకరరావు,బొండా ఎల్లాజీరావు,జాగారపు శ్రీను,ఒమ్మి రంగనాయకులు ,నాగేశ్వరరావు,ఈశ్వరరావు,కేవి రమణ,రాము, ఏసురత్నం ,శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## శ్రీమోక్ష రామచంద్ర స్వామి దేవస్థానం
## ధార్మిక కార్యక్రమాలు

**నంద్యాల (జయ జయహే)**

నంద్యాల పట్టణం, బాల్కొండ హాల్ వద్ద ఉన్న శ్రీ మోక్షరామచంద్ర స్వామి దేవస్థానం నందు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో 7వ తేదీ నుండి మూడు రోజులు ప్రముఖ ధార్మిక ప్రవచకులు, సంస్కృత పండితులు, భక్తిఛానల్ వ్యాఖ్యాత డాక్టర్ దివి హయగ్రీవాచార్యులచే ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజనలు, శుక్రవారం గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఇందుకు సంబందించిన కరపత్రాలను స్థానిక భక్తసమాజంచే ఆవిష్కరింప చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు డి.మధు సుధన్ రావు, డి.రాంప్రసాద్, వీరన్న, రామ్మూర్తి, శ్రీనివాసులు, పవన్ కుమార్, శంతన్, మనోజ్, నవనీత్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనగలరని విజ్ఞప్తి చేశారు.




## కుక్కలకు ఏఆర్వీ టీకాలు

**విశాఖపట్నం (జయ జయహే)**

జీవీఎంసీ 40వ వార్డు పరిధిలో గల ప్రభుత్వ జంతు సంరక్షణా హాస్పటల్లో డాక్టర్ సీహెచ్ సునీల్ కుమార్ ఆధ్యర్యంలో రేబిస్ రాకుండా ముందు జాగ్రత్త చర్యలో భాగంగా రేబిస్ నిరోధిక టేకాలను (ఏఆర్వీ) పలు కుక్కలకు బుధవారం వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వార్డు మాజీ కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు పాల్గొని టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించి అనంతరం మాట్లాడుతూ జంతువులు అంటే ఇష్టపడని వారు ఉండరని మనుషులు ప్రేమ కురిపించాలే కానీ ఎంతో విశ్వాసం చూపిస్తాయన్నారు అయితే చాలామంది అవగాహన లోపంతో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వలన, వాటి ద్వారా వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. మనిషికి సంక్రమించే వ్యాధులకు రక్షణగా ఏటా జులై ఆరో తేదీన స్పెషల్ డ్రై కార్యక్రమం జరుగుతూ ఉంటుందని అంతేకాకుండా ప్రతీరోజు కూడా అందుబాటులో ఈ టీకాలు ఉంటాయని పెంపుడు కుక్కల యజమానులు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా కోరారు ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీల్ కుమార్ తో పాటు సంచారవాహన వైద్యాధికారి అరుణ నారాయణమ్మ,అప్పలనాయుడు, వీరన్న ఇతర వైద్య సిబ్బంది, స్థానిక నాయకులు హెచ్ఎస్ఎల్ చంటిబాబు, మైలవరపు సురేష్ మరియు పెంపుడు కుక్కల యజమానులు పాల్గొన్నారు.



## ఎస్పీని కలిసిన నూతన కంట్రోల్ సిఐ

**అనకాపల్లి ( 6 జయ జయహే )**


అనకాపల్లి జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన బండి రమణయ్య సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఎస్పీ కి పూల మొక్కను అందజేసే శుభాకాంక్షలు తెలిపారు. 2009 బ్యాచ్ కి చెందిన రమణయ్య ఇప్పటివరకు అనకాపల్లి కోర్టులో మానిటరింగ్ సెల్ ఎస్సైగా విధులు నిర్వహించారు. ఇటీవల ఆయనకు పదోన్నతి పొంది అనకాపల్లి జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ సీఐగా బాధ్యతలు సోమవారం స్వీకరించారు ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సీఐ రమణయ్యకు అభినందనలు తెలియజేస్తూ పలు కీలక సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది

## లారీ ఢీకొని వ్యక్తి మృతి

**మక్కువ( సాలూరు రూరల్) జూలై 6.( జయ జయహే)**



సాలూరు మండలం జీగ్రామ్ బైపాస్ రోడ్డులో సోమవారం లారీ ఢీకొన్న సంఘటనలో పాలవలస సూర్యనారాయణ(51) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు సాలూరు రూరల్ పోలీసులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఒడిశా నుండి బైపాస్ రోడ్డు మీదుగా వెళుతున్న లారీ అదే రోడ్డుపై ఉన్న పాలవలస సూర్యనారాయణను ఢీకొన్నట్టు ఆ ప్రమాదంలో సూర్యనారాయణ మరణించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం సాలురు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రవీంద్ర రాజు తెలిపారు. కాగా ఈ ప్రమాదానికి కారకుడైన లారీ డ్రైవర్ని పోలీసులు అదుపులో తీసుకున్నట్లు తెలిసింది. మృతి చెందిన సూర్యనారాయణ సాలూరు టౌన్ బంగారం పేట కార్మిక చెందిన వ్యక్తిగా తెలిసింది.



## హైదరాబాద్‌కు సమగ్ర
# పట్టణ పాలన అవసరం

(సి.హెచ్.ప్రతాప్)

**దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న మహానగరాల్లో హైదరాబాద్ ఒకటి. సమాచార సాంకేతిక రంగం, ఔషధ పరిశ్రమలు, విద్యా సంస్థలు, స్టార్టప్‌లు, సేవారంగ విస్తరణతో నగర జనాభా, ఆర్థిక కార్యకలాపాలు, వాహనాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో దశాబ్దాల క్రితం రూపొందించిన పట్టణ పాలనా విధానాలతో నేటి అవసరాలను పూర్తిస్థాయిలో తీర్చడం కష్టసాధ్యమవుతోంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సమగ్ర, సమన్వయపూర్వక పట్టణ పాలనను రూపొందించాలనే ప్రయత్నం స్వాగతించదగినది. ఆధునిక నగరాభివృద్ధికి చట్టపరమైన వ్యవస్థ కూడా కాలానుగుణంగా మారడం అత్యవసరం.**

హైదరాబాద్ వంటి మహానగరంలో ట్రాఫిక్ నిర్వహణ, రహదారుల అభివృద్ధి, మురుగునీటి పారుదల, తాగునీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ, వీధి దీపాలు, ప్రజారోగ్య సేవలు, ఉద్యానవనాల సంరక్షణ వంటి బాధ్యతలు అనేక సంస్థల పరిధిలో ఉంటాయి. వీటి మధ్య సమన్వయం లోపిస్తే పనుల్లో ఆలస్యం, వనరుల వృథా, ప్రజలకు అసౌకర్యం ఏర్పడుతుంది. సమగ్ర పట్టణ పాలనా వ్యవస్థ ద్వారా ప్రణాళిక, అమలు, పర్యవేక్షణ ఒకే దిశలో సాగితే సేవల నాణ్యత పెరగడంతో పాటు ప్రజా వ్యయం కూడా మరింత సమర్థవంతంగా వినియోగించబడుతుంది.

పట్టణాభివృద్ధిలో సాంకేతికత పాత్ర రోజురోజుకూ పెరుగుతోంది. భూ వినియోగ ప్రణాళిక, ట్రాఫిక్ నియంత్రణ, వర్షపు నీటి పారుదల, నిర్మాణ అనుమతులు, పన్నుల నిర్వహణ, ప్రజా సేవల పర్యవేక్షణ వంటి ప్రక్రియలను డిజిటల్ వేదికల ద్వారా సమన్వయం చేయడం వల్ల పారదర్శకత పెరుగుతుంది. కృత్రిమ మేధస్సు, భౌగోళిక సమాచార వ్యవస్థలు, ప్రత్యక్ష డేటా విశ్లేషణ, స్మార్ట్ సెన్సార్ల వినియోగం ద్వారా సమస్యలను ముందుగానే గుర్తించి తక్షణ చర్యలు చేపట్టవచ్చు. ప్రజలకు సేవలు వేగంగా అందడమే కాకుండా పరిపాలనా సామర్థ్యం కూడా మెరుగుపడుతుంది.

పర్యావరణ పరిరక్షణ, విపత్తుల నిర్వహణ కూడా పట్టణ పాలనలో విడదీయరాని భాగాలు. వర్షాకాలంలో నగర వరదలు తగ్గాలంటే చెరువులు, కాలువలు, సహజ జలమార్గాలను పరిరక్షించడం, శాస్త్రీయ డ్రైనేజీ వ్యవస్థలను అభివృద్ధి చేయడం అవసరం. వాతావరణ మార్పుల ప్రభావం దృష్ట్యా అధిక వర్షపాతం, ఉష్ణోగ్రతల పెరుగుదల వంటి పరిస్థితులకు అనుగుణంగా నగర ప్రణాళిక ఉండాలి. విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచే మౌలిక సదుపాయాలు, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, అత్యవసర స్పందన వ్యవస్థలను బలోపేతం చేయడం కూడా అత్యంత ముఖ్యం.

రవాణా రంగంలోనూ సమగ్ర దృష్టి అవసరం. మెట్రో రైలు, బస్సులు, ఎంఎంటీఎస్, సైకిల్ మార్గాలు, పాదచారుల సౌకర్యాలను పరస్పరం అనుసంధానించడం ద్వారా ట్రాఫిక్ రద్దీ, కాలుష్యాన్ని తగ్గించవచ్చు. ప్రజా రవాణాకు ప్రాధాన్యం పెరిగితే ఇంధన వినియోగం తగ్గడంతో పాటు నగర జీవన నాణ్యత కూడా మెరుగుపడుతుంది. అదే సమయంలో పట్టణ స్థానిక సంస్థల ఆర్థిక స్వయం సమృద్ధిని పెంపొందించడం, ఆదాయ వనరులను బలోపేతం చేయడం ద్వారా సేవల నాణ్యతను మరింత మెరుగుపరచవచ్చు.

ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏ పట్టణ పాలనా వ్యవస్థా సంపూర్ణం కాదు. నివాస సంఘాలు, పౌరసంఘాలు, నిపుణులు, పరిశ్రమల ప్రతినిధులు, విద్యాసంస్థల సూచనలకు విధాన రూపకల్పనలో స్థానం కల్పించాలి. సేవల నాణ్యతపై క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించడం, పనితీరు సూచికలను ప్రజలకు అందుబాటులో ఉంచడం ద్వారా జవాబుదారీతనం పెరుగుతుంది. సమర్థవంతమైన పాలన, శాస్త్రీయ ప్రణాళిక, సాంకేతికత వినియోగం, పర్యావరణ పరిరక్షణ, పారదర్శక పరిపాలన, ప్రజల భాగస్వామ్యం అనే సూత్రాలను సమన్వయం చేసినప్పుడే హైదరాబాద్ భవిష్యత్తు సుస్థిరంగా, సురక్షితంగా, ప్రపంచ స్థాయి మహానగరంగా రూపుదిద్దుకోగలదు.



# మహాభారతంలో అత్యంత అద్భుతమైన పాత్ర..... బర్బరీకుడు!

### ఈ బర్బరీకుడు ఎవరు?

(పుట్టా శ్రీనివాసరావు,)

బర్బరీకుడు భీముడి మనవడు, ఘటోత్కచుడి కుమారుడు. ఈయనకు చిన్నతనం నుంచే యుద్ధ విద్యల పట్ల విపరీతమైన ఆసక్తి ఉండేది. తన తల్లి అయిన అహిలావతి దగ్గర రాజనీతిని, యుద్ధ విద్యలను నేర్చుకున్నాడు.

**శివుని వల్ల ఏ వరం పొందాడు?**

బర్బరీకుడు నవదుర్గలను, పరమశివుడిని మెప్పించి ఘోరమైన తపస్సు చేశాడు. శివుడు అతని తపస్సుకు మెచ్చి, అతనికి మూడు అమోఘమైన బాణాలను (తీన్ బాణ్) ప్రసాదించాడు.

మొదటి బాణం:

శత్రువులందరినీ, నాశనం చేయాల్సిన లక్ష్యాలను గుర్తు చేస్తుంది.

రెండవ బాణం:

రక్షించాల్సిన వారిని, వదిలేయాల్సిన వస్తువులను గుర్తిస్తుంది.

మూడవ బాణం:

మొదటి బాణం గుర్తించిన శత్రువులందరినీ క్షణాల్లో సంహరించి తిరిగి బర్బరీకుడి అమ్ములపొదిలోకి చేరుకుంటుంది.

ఈ మూడు బాణాల వల్ల బర్బరీకుడు కేవలం కొన్ని నిమిషాల్లోనే ఇరుపక్షాల సైన్యాన్ని ఒంటరిగా అంతమొందించగల శక్తిని పొందాడు.

**కురుక్షేత్ర యుద్ధంలో ఎందుకు పాల్గొనలేకపోయాడు?**

కురుక్షేత్ర యుద్ధం ప్రారంభమయ్యే ముందు, బర్బరీకుడు యుద్ధం చూడటానికి, వీలైతే పాల్గొనడానికి బయలుదేరాడు. బయలుదేరే ముందు తన తల్లికి ఒక మాట ఇచ్చాడు. యుద్ధంలో ఏ పక్షం అయితే బలహీనంగా ఉండి, ఓడిపోయే స్థితిలో ఉంటుందో... నేను ఆ పక్షాన నిలబడి పోరాడుతాను అని శపథం చేశాడు.

శ్రీకృష్ణుడికి ఈ విషయం తెలిసింది. బర్బరీకుడు కనుక యుద్ధంలో దిగితే మహాభారత యుద్ధం ఒక్క రోజులో ముగిసిపోతుంది. ఎందుకంటే, బర్బరీకుడు ఓడిపోయే పక్షాన (కౌరవుల వైపు) చేరి పాండవులను చంపేస్తాడు.అప్పుడు పాండవులు బలహీనపడతారు. కాబట్టి బర్బరీకుడు మళ్లీ పాండవుల వైపు మారి కౌరవులను చంపుతాడు. ఇలా ఇరువైపులా అందరూ చనిపోయి, చివరకు బర్బరీకుడు ఒక్కడే మిగులుతాడు. ధర్మ స్థాపన జరగదు.

**కృష్ణుడి మాయ - త్యాగం**

శ్రీకృష్ణుడు ఒక బ్రాహ్మణుడి రూపంలో బర్బరీకుడిని కలిసి అతని శక్తిని పరీక్షించాడు. ఒకే బాణంతో ఒక రావిచెట్టు ఆకులన్నింటినీ రాల్చమని అడిగాడు. బర్బరీకుడు బాణం వేయగా, అది చెట్టు ఆకులన్నింటినీ గుర్తు పెడుతూ, కృష్ణుడు తన పాదం కింద దాచిన ఒక ఆకును కూడా గుర్తు పెట్టడానికి కృష్ణుడి పాదం చుట్టూ తిరిగింది. బర్బరీకుడి శక్తిని గ్రహించిన కృష్ణుడు, దానంగా అతని తల (శీర్షం) అడిగాడు.

కృష్ణుడి మహిమను గ్రహించిన బర్బరీకుడు, వచ్చినవాడు సాక్షాత్తు పరమాత్ముడే అని తెలుసుకుని, సంతోషంగా తన తలను దానం చేయడానికి సిద్ధపడ్డాడు. కానీ, తనకు మహాభారత యుద్ధం మొత్తం చూడాలని ఉందని కోరాడు.యుద్ధము తరువాత అతను ఏ తీర్పు ఇచ్చాడు?




కృష్ణుడు బర్బరీకుడి తలను ఒక ఎత్తైన కొండపై (స్తంభంపై) ఉంచాడు. అక్కడ నుండి బర్బరీకుడు యుద్ధం మొత్తాన్ని వీక్షించాడు.

యుద్ధం ముగిసిన తర్వాత పాండవులలో "యుద్ధం గెలవడానికి నేనే కారణం అంటే నేనే కారణం" అని అహంకారం, వివాదం మొదలైంది. అప్పుడు కృష్ణుడు "ఈ యుద్ధాన్ని మొదటి నుండి చివరి వరకు తటస్థంగా చూసింది బర్బరీకుడు ఒక్కడే, కాబట్టి అతన్నే అడుగుదాం" అని అందరినీ బర్బరీకుడి దగ్గరకు తీసుకెళ్లాడు.

**బర్బరీకుడి తీర్పు**

నాకు యుద్ధరంగంలో ఏ ఒక్క వీరుడూ (అటు భీముడు గానీ, ఇటు అర్జునుడు గానీ) యుద్ధం చేస్తున్నట్టు కనిపించలేదు. నాకు కనిపించిందల్లా ఒక్కటే... శ్రీకృష్ణుని సుదర్శన చక్రం శత్రువుల తలలను నరుకుతుంటే, మహాకాళి ఆ రక్తాన్ని తాగుతూ కనిపించింది. ఈ యుద్ధం మొత్తం కృష్ణుడి వ్యూహం, మహిమ వల్లే సాగింది తప్ప మిగతా వారంతా కేవలం నిమిత్తమాత్రులు."

ఈ తీర్పుతో పాండవుల అహంకారం అణిగిపోయింది.

**కృష్ణుడు ఇచ్చిన వరం ఏమిటి?**

బర్బరీకుడు చేసిన గొప్ప త్యాగానికి, భక్తికి మెచ్చిన శ్రీకృష్ణుడు అతనికి ఒక అద్భుతమైన వరం ఇచ్చాడు:

**కృష్ణుడి వరం:**

కలియుగంలో నువ్వు నా పేరుతో పూజలందుకుంటావు. నీ భక్తులు నిన్ను నా స్వరూపంగా భావిస్తారు. నీ దగ్గరకు వచ్చి మనస్ఫూర్తిగా మొరపెట్టుకునే భక్తుల కోరికలు వెంటనే నెరవేరుతాయి" అని వరమిచ్చాడు.

ఈ వరం వల్లే ప్రస్తుతం బర్బరీకుడిని రాజస్థాన్‌లోని ఖాటు అనే ప్రదేశంలో "ఖాటు శ్యామ్ జీ" ( అనే పేరుతో శ్రీకృష్ణుడి రూపంలో ఎంతో వైభవంగా పూజిస్తారు. కలియుగంలో అత్యంత శక్తివంతమైన దేవుళ్లలో ఈయన ఒకరిగా భక్తుల నమ్మకం.

# రైల్వే ట్రాక్ భద్రతకు సమగ్ర కార్యాచరణ అవసరం

(సి.హెచ్.ప్రతాప్)

**రైల్వేలు దేశ ఆర్థికాభివృద్ధికి, ప్రజల రవాణాకు కీలకమైన మౌలిక సదుపాయాలు. ప్రతి రోజు లక్షలాది మంది ప్రయాణికులు, భారీ మొత్తంలో సరకు రవాణా రైల్వే వ్యవస్థపై ఆధారపడుతున్నాయి. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లాలో రైల్వే పట్టాలు దాటే ప్రయత్నంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన మరోసారి రైల్వే ట్రాక్ భద్రతపై సమగ్ర దృష్టి సారించాల్సిన అవసరాన్ని గుర్తుచేసింది. ఇలాంటి ప్రమాదాలు వ్యక్తిగత నిర్లక్ష్యం వల్ల జరిగినట్లు కనిపించినప్పటికీ, వాటి వెనుక మౌలిక సదుపాయాల కొరత, అవగాహన లోపం, భద్రతా చర్యల పరిమితి వంటి అనేక కారణాలు దాగి ఉంటాయి. అందుకే ఈ సమస్యను సమగ్ర దృష్టితో పరిశీలించి శాశ్వత పరిష్కారాలను అమలు చేయాల్సిన అవసరం ఉంది.**



రైల్వే భద్రత అనేది కేవలం రైల్వే శాఖ బాధ్యత మాత్రమే కాదు. ప్రజలు, స్థానిక సంస్థలు, విద్యాసంస్థలు, గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థలు సమిష్టిగా బాధ్యత వహించాల్సిన అంశం. సమీప దారి కోసం పట్టాలు దాటడం, మూసివేసిన లెవెల్ క్రాసింగ్‌లను నిర్లక్ష్యంగా దాటేందుకు ప్రయత్నించడం, హెచ్చరికలను పట్టించుకోకపోవడం వంటి అలవాట్లు ప్రాణాంతక పరిణామాలకు దారితీస్తాయి. ప్రజల్లో భద్రతా సంస్కృతి పెంపొందించడమే ప్రమాదాల నివారణకు మొదటి అడుగు.

రైల్వే మార్గాల సమీపంలో జనావాసాలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడం అత్యవసరం. పాదచారుల కోసం ఫుట్ ఓవర్‌బ్రిడ్జిలు, అండర్‌పాస్‌లు, భద్రతా కంచెలు, సక్రమమైన దారి నిర్దేశక బోర్డులు అందుబాటులో ఉంటే అనధికారికంగా పట్టాలు దాటే ఘటనలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయడం, అవసరమైన చోట్ల అదనపు సిబ్బందిని నియమించడం, రైల్వే మార్గాల వెంట రక్షణ కంచెలను విస్తరించడం కూడా అవసరం. ఇటువంటి చర్యలు ప్రజలు అనుకోకుండా పట్టాలపైకి వెళ్లకుండా నిరోధిస్తాయి.


ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా రైల్వే భద్రతలో విస్తృతంగా వినియోగించాల్సిన సమయం ఆసన్నమైంది. సీసీటీవీ కెమెరాలు, కృత్రిమ మేధస్సు ఆధారిత నిఘా వ్యవస్థలు, సెన్సార్ ఆధారిత హెచ్చరిక పరికరాలు, శబ్ద--కాంతి హెచ్చరిక సంకేతాలు, స్వయంచాలక అలారాలు వంటి వ్యవస్థలు ప్రమాదాలను ముందుగానే గుర్తించి హెచ్చరించగలవు. ప్రమాదాలు ఎక్కువగా సంభవించే ప్రాంతాలను డిజిటల్ మ్యాపింగ్ చేసి, క్రమం తప్పకుండా భద్రతా తనిఖీలు నిర్వహించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చు. ఆధునిక ఇంజినీరింగ్ పరిష్కారాలను స్థానిక అవసరాలకు అనుగుణంగా అమలు చేయడం వల్ల భద్రత మరింత బలోపేతమవుతుంది.

భద్రతపై అవగాహన కల్పించడం కూడా అంతే ముఖ్యమైన అంశం. పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో రైల్వే భద్రతపై నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. స్థానిక భాషలో హెచ్చరిక బోర్డులు, ప్రచార చిత్రాలు, సామాజిక మాధ్యమాల ద్వారా సందేశాలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో భద్రతా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలి. స్థానిక యువజన సంఘాలు, నివాస సంఘాలు కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వాములైతే భద్రతా సందేశం మరింత విస్తృతంగా ప్రజలకు చేరుతుంది. అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలనే అంశంపై కూడా ప్రజలకు అవగాహన కల్పించడం అవసరం.

రైల్వే ట్రాక్ ప్రమాదాల నివారణకు నిందారోపణల కంటే నివారణ చర్యలకే ప్రాధాన్యం ఇవ్వాలి. ఇంజినీరింగ్ పరిష్కారాలు, సాంకేతిక పర్యవేక్షణ, సమర్థవంతమైన మౌలిక సదుపాయాలు, ప్రజల్లో అవగాహన, చట్టాల పట్ల బాధ్యతాయుతమైన ప్రవర్తన అనే అంశాలు సమన్వయంతో అమలైతేనే ప్రమాదాలను సమర్థంగా నివారించవచ్చు. ప్రతి ప్రాణం అమూల్యమనే భావనతో రైల్వే భద్రతను జాతీయ ప్రాధాన్య అంశంగా పరిగణించి సమగ్ర కార్యాచరణ చేపట్టడం ద్వారా భవిష్యత్తులో ఇటువంటి విషాదాలను గణనీయంగా తగ్గించవచ్చు. సురక్షిత రైల్వే వ్యవస్థ నిర్మాణం ప్రభుత్వ సంస్థల కృషితో పాటు ప్రతి పౌరుని అప్రమత్తత, బాధ్యతాయుతమైన ప్రవర్తనపైనే ఆధారపడి ఉంటుందనే విషయాన్ని సమాజం గుర్తుంచుకోవాలి.

# ఎమ్మెల్యేల దృష్టికి ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు





## వినతి పత్రం అందించిన జేఏసీ చైర్మన్ ఈశ్వర్ రావు

## హామీ ఇచ్చిన ఎమ్మెల్యేలు విష్ణు కుమార్, వంశీ కృష్ణ

విశాఖపట్నం, జూలై 6, జయ జయహే

రాష్ట్ర ఎన్ జీ ఓ జేఏసీ పిలుపు మేరకు జిల్లా జేఏసీ ప్రతినిధులు ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ఎమ్మెల్యే ల దృష్టికి తీసుకెళ్లారు. విశాఖపట్నం ఉత్తర శాసనసభ సభ్యులు పి. విష్ణుకుమార్ రాజు, దక్షిణ నియోజకవర్గం శాసన సభ సభ్యులు వంశీకృష్ణ శ్రీనివాసరావు ని కలసి ఉద్యో గుల యొక్క పెండింగ్ డిమాండ్ లను వివరించారు. ఆ డిమాండ్ లను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి వాటి పరిస్కారానికి సహకరించాలని వారిని కోరారు. అందుకు వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే లను కలిసిన వారిలో జిల్లా జేఏసీ చైర్మన్ కే. ఈశ్వర్ రావు, జేఏసీ కార్యదర్శి ఎం. శ్రీను, జిల్లా పంచాయతీ రాజ్ మినిస్టరియల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్. సత్తిబాబు, జిల్లా జేఏసీ కోశాధికారి పి. అప్పలరాజు, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ప్రతినిధి వై ఎన్ ప్రసాద్, సిటీ జేఏసీ చైర్మన్ వై. నారాయణ రావు, జిల్లా జేఏసీ సంయుక్త కార్యదర్శి జగదీశ్వరావు, సీటీ జేఏసీ సంయుక్త కార్యదర్శి జి. చంద్ర రావు, సీటీ జేఏసీ కోశాధికారి డి. రామారావు, సీటీ జేఏసీ కార్యవర్గ సభ్యులు అప్పలనాయుడు, సీటీ ఉపాధ్యక్షులు రాం ప్రసాద్, సీటీ సంయుక్త కార్యదర్శి మన్మోహన్ తదితరులున్నారు.

# పాఠశాల విద్యార్థులకు పోస్టల్ డిపార్ట్మెంట్ ఉచిత బయోమెట్రిక్

మాడుగుల జులై 6 జయ జయహే




మాడుగుల పోస్ట్ ఆఫీస్ ద్వారా విద్యార్థులకు ఉచిత బయోమెట్రిక్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఐదు నుంచి 17 ఏళ్లలోపు విద్యార్థులకు బయోమెట్రిక్ ఉండాలన్న ఉద్దేశంతో మాడుగుల పోస్ట్ ఆఫీస్ ద్వారా ఈనెల 18వ తేదీ వరకు గ్రామాల్లో గల అన్ని పాఠశాలలో కళాశాలలో గల విద్యార్థులకు ఈ మాండేటరీ బయోమెట్రిక్ కార్యక్రమాన్ని ఉచితంగా అందించనున్నట్టు తెలిపారు. దీంట్లో భాగంగా సోమవారం మాడుగుల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పిఏ నవీన్, ఏబీపీఎం హేమ ని, ఆధార్ ఆపరేటర్ భాషిత, ఆచారి,పాఠశాల ఉపాధ్యాయులు కే శ్రీనివాసరావు ఎస్. సూర్యనారాయణ, ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు. మాడుగుల గల జూనియర్ కళాశాల ఉన్నత పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ బయోమెట్రిక్ వేస్తామని భాషిత తెలిపారు. అయితే ఇప్పటికే ఈ కార్యక్రమాన్ని పోస్ట్ ఆఫీస్ నిర్వహిస్తున్నారు

# బిజేపి యువ మోర్చా నాయకుడు మృతి

గాజువాక (జయ జయహే)



గంగవరం గ్రామానికి చెందిన బిజేపి సీనియర్ నాయకుడు గరికిన పైడిరాజు మరియు 64వ వార్డు అధ్యక్షురాలు గరికిన మాధవి కుమారుడు బిజేపి గంగవరం మండలం యువ మోర్చా నాయకుడు గరికిన మహా దుర్గా ప్రసాద్ రాజు కన్నుమూశారు. మాట వినికిడి లోపం ఉన్న దుర్గాప్రసాద్ మనస్తాపానికి గురై నాలుగు రోజుల క్రితం ఉరి వేసుకుని ఆత్మ హత్యకు పాల్పడ్డారు. హుటాహుటిన తండ్రి పైడిరాజు హాస్పిటల్ కి తీసుకెళ్లారు. కానీ సోమవారం కేజీహెచ్ లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు తెలిపారు. వారి అంతిమ యాత్రలో బిజేపి గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు గంగవరం అధ్యక్షుడు పేర్ల అప్పారావు,మాజీ కౌన్సిలర్ పేర్ల సత్యారావు తదితరులు పాల్గొన్నారు. దుర్గా ప్రసాద్ పార్థివ దేహానికి పూల మాలలు బిజేపి జెండా కప్పి నివాళులు అర్పించారు. అనంతరం పాడి మోసారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ దుర్గాప్రసాద్ చురుకుగా బిజేపి కార్యక్రమాల్లో పాల్గొనే వారని అన్నారు. అటువంటి మంచి నాయకుడు కోల్పోవడం బాధాకరమన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అంతిమ యాత్రలో నాయకులు సిరసపల్లి నూకరాజు, పొలిమేర శ్రీనివాసరావు, దీనంకొండ కృష్ణంరాజు, దానేష్ ,కిలాని ముసలయ్య బారీగా గ్రామస్థులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# డాక్టర్ శ్యామా ప్రసాద్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తి

## పుట్ట గంగయ్య

మాడుగుల జులై ఆరు జయ జయహే

భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, గొప్ప జాతీయవాది డా. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా మాడుగుల మండలంలో సోమవారం బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాడుగుల పార్టీ కార్యాలయంలో జరిగిన శ్యాం ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఇంచార్జ్ పుట్ట గంగయ్య మాట్లాడుతూ, డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశ సమైక్యత, జాతీయ సమగ్రత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహానేత అని పేర్కొన్నారు. 1901 జూలై 6న కోల్‌కతాలో జన్మించిన ఆయన విశిష్ట విద్యావేత్తగా, కోల్‌కతా విశ్వవిద్యాలయ ఉపకులపతిగా సేవలందించారని తెలిపారు. అనంతరం దేశ తొలి కేంద్ర మంత్రివర్గంలో పరిశ్రమలు,పౌర సరఫరాల మంత్రిగా పనిచేసి, 1951లో భారతీయ జనసంఘ్‌ను స్థాపించి జాతీయ రాజకీయాలకు కొత్త దిశను చూపారని అన్నారు. జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదాను వ్యతిరేకిస్తూ "ఏక్ దేశ్ -- ఏక్ విధాన్ -- ఏక్ ప్రధాన్" అనే జాతీయ సంకల్పంతో ఉద్యమించారని, దేశ సమైక్యత కోసం చేసిన పోరాటంలో 1953 జూన్ 23న నిర్బంధంలో అమరుడయ్యారని గుర్తు చేశారు. డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలు నేటి యువతకు మార్గదర్శకమని, వాటి సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మోర్చా ఉత్తరాంధ్ర జోనల్ ఇంచార్జ్ మండల సంతోషపు లక్ష్మి , అల్లూరి సీతారామరాజు జిల్లా ఇంచార్జ్ పుట్ట గంగయ్య, మండల అధ్యక్షులు మేలిపాక స్వామి , మండల ప్రధాన కార్యదర్శి మండల సత్యజిత్ రాయ్, హాస్పిటల్ డైరెక్టర్ మండల ఛాయారామ్ , గండేపల్లి వెంకటరమణ పాత్రిపల్లి అప్పారావు , కోన రామకృష్ణ , పచ్చికూర సాయి , సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



## బిజెపి జనతా వారధి అర్జీలపై

# అధికారులకు వినతి

## టెక్కలిలోని సమస్యల పరిష్కారానికి బిజెపి కృషి

టెక్కలి జూలై 6 జయ జయహే

టెక్కలి పట్టణంలోని వీధుల్లో సుదీర్ఘకాలంగా తిష్ట వేసిన ప్రజా సమస్యలపై భారతీయ జనతా పార్టీ వినూత్న కార్యక్రమం జనత వారధి చేపట్టినట్లు టెక్కలి మండలం బిజెపి అధ్యక్షులు జర్జాన రామ్ జీ తెలిపారు. టెక్కలిలో వానాకాలం లో పేరుకుపోయిన చెత్తను పరిశుభ్రం చేసి మురికి కాలువల ద్వారా నీరు వెళ్లేలా చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేశారని పలు వీధుల్లో విద్యుత్తు లైట్లు ఏర్పాటు చేయాలని స్పందన వచ్చినట్లు రాంజీ అన్నారు. డాక్టర్ అంబేద్కర్ కూడలి నుంచి ఇందిరాగాంధీ విగ్రహం మధ్య ప్రధాన రహదారిలో ఉన్న మద్యం దుకాణాన్ని అక్కడ నుంచి తరలించాలని పలువురు ప్రజలు వినతి పత్రం ద్వారా తెలియజేశారన్నారు. ఇదే ప్రాంతంలో సుప్రసిద్ధ శిరిడి సాయిబాబా మందిరం ఉందని ఈ ప్రాంతంలో విచ్చలవిడిగా రాత్రి వేళల్లో పలువురు మద్యం సేవించడం వల్ల స్థానికులు మహిళలు ఈ రహదారిలో ప్రయాణించడం చాలా అసౌకర్యం కలుగుతుందని స్థానిక మహిళలు విజ్ఞప్తి చేశారని రాంజీ అన్నారు. జనతా వారధి కార్యక్రమంలో తమ బృందానికి వచ్చిన ప్రజా సమస్యల వినతులు అర్జీలను సంబంధిత అధికారులకు తక్షణ పరిష్కారం కోసం అందజేసినట్లు జర్జాన రాంజీ , బిజెపి ప్రతినిధులు తెలిపారు.



# మోదకొండ అమ్మవారిని దర్శించుకున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్కే జోషి

మాడుగుల జూలై 6 జయ జయహే

కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్కే జోషి సోమవారం మాడుగుల మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఎన్నికల ఓటర్ల ప్రక్రియ ఎస్ ఐ ఆర్ కార్యక్రమం పర్యవేక్షణలో భాగంగా మాడుగుల మండలంలో పర్యటించిన ముందుగా అమ్మవారిని దర్శించుకొని ఆశీస్సులు పొందరు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు ఆలయ మర్యాదలతో ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ తరఫున జోషిని సత్కరించి జ్ఞాపిక అందజేసి ఆలయ ప్రాశస్త్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కే రమాదేవి, ఆలయ కమిటీ చైర్మన్ పి అప్పలరాజు, సభ్యులు ఎస్ శ్రీనివాసరావు, మీ బలరాం, పి క్రాంతి, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పి లక్ష్మీనారాయణ, కే నానాజీ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా బాబు జగజీవన్ రామ్ వర్ధంతి వేడుకలు

చోడవరం : జూలై 6 జయ జయహే

జూలై 6, భారతదేశ ఉప ప్రధాన మంత్రిగా సేవలందించిన, దళితుల ఆశాజ్యోతి బాబూ జగజీవన్ రావ్ వర్ధంతిని సోమవారం చోడవరం ఇందిరా కాలనీలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఇందిరా కాలనీ వద్ద ఉన్న బాబు జగజీవన్ రావు విగ్రహానికి దళిత నాయకులు, యువకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. "ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఖండేల వెంకట్రావు, చిన్నం నాగరాజు, కండెల నరసింహారావు, ఎలక దుర్గారావు, పెద్దాడ రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



# బి.ఎల్.వోలు కనబడుటలేదు

## నెమ్మదిగా ..., ఓటరు జాబితా సమగ్ర సవరణ

## ఐదుగురికి షోకాజ్ నోటీసులు

చోడవరం,జూలై 6, జయ జయహే

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) పట్ల అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంటింటికి తిరిగి సమగ్ర సర్వే చేపట్టాల్సిన బి.ఎల్వోలు, గడువు దగ్గర పడుతున్న కొద్దీ ఓటరు నమోదు అధికారులు కనబడటం లేదంటూ ఓటర్లు ఆందోళన చెందుతున్నారు. కార్యాలయాల కే పరిమితం అవుతున్న బి.ఎల్వోలు అధికార పార్టీ నేతల చెప్పు చేతల్లో నడుచుకుంటున్నారనే బహిరంగ విమర్శలు ఉన్నాయి. చోడవరం మండలంలో ఇప్పటికే ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) నమోదు పట్ల నిర్లక్ష్యం చేస్తున్న వీఆర్వో, నలుగురు బిఎల్ఓ లకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు మండల తహసిల్దార్ తెలియజేశారు. తక్షణమే ఉన్నతాధికారులు ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) నమోదు ప్రక్రియకు సంబంధించి నిష్పక్షపాతంగా,... అర్హులైన వారందరినీ ఓటరుగా నమోదు చేయాలని, ఎటువంటి స్వార్థపూరిత రాజకీయాలకు లొంగకుండా,... అధికారులు ప్రభుత్వ విధులను సక్రమంగా నిర్వహించాలంటూ ప్రజా సంఘాలు, వామపక్షాలు, ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.



# మాడుగుల సహకార సంఘంలో రచ్చబండ కార్యక్రమం

మాడుగుల జులై 6 జయ జయహే

సహకార వారోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో సోమవారం మాడుగుల సహకార సంఘం ఆవరణలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. సంఘ చైర్పర్సన్ కొట్నాల తినాథరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, టిడిపి పట్టణ అధ్యక్షుడు పీ లక్ష్మీనారాయణ, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి రోబ్బ మహేష్, ఆస్పత్రి కమిటీ సభ్యుడు లెక్కల కాశిబాబు,సంఘ సీఈవో బి ఈశ్వరరావు, సంఘ డైరెక్టర్లు కర్రి లక్ష్మిరావు, మాటూరు మంగమ్మ, మాజీ అధ్యక్షుడు పి మురళి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాడుగుల సంఘం ద్వారా నిర్వహిస్తున్న వివిధ పథకాల గురించి , అందిస్తున్న వడ్డీ రేట్లు, బంగారం ఆభరణాలపై అందిస్తున్న రుణాలు వడ్డీ రేట్లు, వ్యవసాయ, వ్యవసాయ యాతర రుణాలు, స్వల్ప దీర్ఘకాలిక రుణాలు గురించి చర్చించారు. తులానికి 80000 చొప్పున తక్కువ వడ్డీకే బంగారంపై రుణాలు అందిస్తున్నట్టు తెలిపారు.




# మాడుగులలో ఘనంగా ప్రపంచ జూనోసిస్ దినోత్సవం

మాడుగుల జూలై 6, జయ జయహే

ప్రపంచ జూనోసిస్ దినోత్సవము సందర్భంగా సోమవారం మాడుగుల మండలంలోని అన్ని పశు వైద్య శాలల్లో పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకా వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా మాడుగుల పశు వైద్యశాల ఆవరణంలో 26 పెంపుడు కుక్కలకు టీకాలు వేశారుఎ అలాగే కె.జె.పురం పరిధిలో లో 32, ఎం. కోడూరు పరిధిలో లో 22 , కింతలి వల్లాపురం పరిధిలో లో 31 పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరిగిందని మండలంలో మొత్తం 101 టీకాలు వేసినట్టు పశుసంవర్ధక శాఖ మాడుగుల ఏరియా ఏడి డాక్టర్ చిట్టినాయుడు తెలిపారు

# బీచ్ షాక్స్ రద్దు చేయాలి





### బీచ్‌లో వైసీపీ మహిళల వినూత్న ఆందోళన

**విశాఖపట్నం, జూలై 6, జయ జయహే**

బీచ్ షాక్స్" పేరు తో కూటమి ప్రభుత్వం బీచ్ లో పెడుతున్న మద్యం దుకాణాలుకు వ్యతిరేకంగా శాసనమండలి సభ్యురాలు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనకు వైసీపీ నేతలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం మహిళా విభాగం అధ్యక్షురాలు, విశాఖపట్నం తూర్పు నియోజకవర్గం పరిశీలకులు పేడాడ రమణికుమారితో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన మహిళలు నల్ల బెలూన్లు, నల్ల రిబ్బన్లతో బీచ్ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. బీచ్ షాక్స్‌కు సంబంధించిన ప్రభుత్వ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ,ఆ జీవో పత్రాలను దహనం చేశారు. అంతేకాకుండా మద్యం బాటిళ్లను పగులగొట్టి తమ నిరసనను వ్యక్తం చేశారు.ప్రశాంతంగా ఉండే ఆర్కే బీచ్ ను స్మశానంగా మార్చొద్దు అంటూ నినాదించారు. మహిళా భద్రతే ముఖ్యమని బీచ్ సాక్స్ (బీచ్ లో మద్యం దుకాణాలు) వద్దంటూ మహిళా నేతలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు గొల్ల బాబు రావు,మాజీ పార్లమెంటు సభ్యురాలు,విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీ ,విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షులు కె.కె రాజు గారు,సమన్వయకర్తలు తిప్పల దేవన్ రెడ్డి ,మొల్లి అప్పారావు,మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు,రొంగలి జగన్నాధం ,విశాఖ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర ,మాజీ పార్లమెంటు సభ్యురాలు బీసెట్టి వెంకట సత్యవతి,మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి,కొత్తగుల్లి భాగ్యలక్ష్మి,మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లే అనురాధ ,మాజీ మేయర్ హరి వెంకట కుమారి,నగర మాజీ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ,మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగమణి,శ్రీకాకుళం జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉలాల భారతి దివ్య ,విజయనగరం మహిళా అధ్యక్షురాలు పిన్నింటి కళావతి, అనకాపల్లి మహిళా విభాగం అధ్యక్షురాలు లోచల సుజాత, రాష్ట్ర ,మాజీ జిల్లా వివిధ కార్పొరేషన్ చైర్మన్లు ,మాజీ కార్పొరేటర్లు,జోన్-1కు చెందిన మహిళా నాయకులు,రాష్ట్ర మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు,రాష్ట్ర పార్టీ కార్యవర్గం సభ్యులు నగర జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు,రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు ,మాజీ రాష్ట్ర జిల్లా వివిధ కార్పొరేషన్ డైరెక్టర్ ,వార్డు అధ్యక్షులు,జిల్లా అధ్యక్షులు, జిల్లా ఇన్‌చార్జిలు, నియోజకవర్గ మహిళా అధ్యక్షులు,ముఖ్య నాయకులు ,సీనియర్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే మత్స్యకారుల గల్లంతు

- గల్లంతైన ఆరుగురిని వెతికి తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే
- వైఎస్సార్సీపీ రంగంలోకి దిగిన తర్వాతనే అధికారుల్లో చలనం
- ఎంపీ భరత్, జనసేన ఎమ్మెల్యేలకు బాధ్యత లేదు
- మత్స్యకారుల ప్రాణాలంటే ఈ ప్రభుత్వానికి లెక్కే లేదు
- ప్రభుత్వ యంత్రాంగం, నాయకులు సమన్వయంతో పనిచేసి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేది
- నిప్పులు చెరిగిన మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్




**విశాఖపట్నం, జూలై 6, జయ జయహే**

కూటమి ప్రభుత్వ ఘోర నిర్లక్ష్యం, యంత్రాంగం వైఫల్యం, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే ల ఉదాసీన వైఖరి వల్లే వేటకు వెళ్లిన ఆరుగురు మత్స్యకారులు గల్లంతయ్యారని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విశాఖలోని తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధుల తీరుపై తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. ఈ ప్రభుత్వానికి మత్స్యకారుల ప్రాణాలంటే లెక్కే లేదని, సూటు బూటు వేసుకున్న ధనవంతుల రక్షణ, సౌకర్యాల కోసమే పని చేస్తోందని ఆరోపించారు. వైఎస్సార్సీపీ హయాంలో ఏదైనా మత్స్యకారుల బోటుకు ప్రమాదం జరిగితే వెంటనే స్పందించి వారిని కాపాడేలా నిర్దిష్టమైన వ్యవస్థ, టెక్నాలజీ అందుబాటులో ఉండేదని చెప్పారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక మత్స్యకారులను పట్టించుకోవడం మానేసిందని, వ్యవస్థను నిర్లక్ష్యం చేయడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీచ్ షాక్స్ పేరుతో బీచ్‌లలో మద్యం అమ్ముకోవడంలో ఉన్న శ్రద్ధ.. మత్స్యకారుల ప్రాణాలపై చంద్రబాబుకు లేదని ధ్వజమెత్తారు. గల్లంతైన మత్స్యకారులను ఎలాగైనా వెతికి తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రమాదం జరిగిన 20 గంటల వరకు ప్రభుత్వం స్పందించి సహాయ కార్యక్రమాలు ప్రారంభించలేదని ధ్వజమెత్తారు. వైఎస్సార్సీపీ తరఫున డిమాండ్ చేస్తే కానీ ప్రభుత్వంలో కదలిక రాలేదని, ఈ ప్రమాదంపై మంత్రులు లోకేష్, పవన్ కళ్యాణ్ వెంటనే స్పందించాలని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ డిమాండ్ చేసారు.

**వాతావరణ శాఖ హెచ్చరికలు బేఖాతర్**

జూలై 3, 4 తేదీల్లో సముద్రంలో గందరగోళ పరిస్థితులు ఉంటాయని, వాతావరణం చేపల వేటకు అనుకూలంగా ఉ ఒడదని వాతావరణ శాఖ సలహా బోర్డు ముందే హెచ్చరించింది. ఇంత పెద్ద హెచ్చరిక ఉన్నప్పటికీ ప్రభుత్వం కనీసం అలర్ట్ కాలేదు, అప్రమత్తం చేయడానికి వార్ రూమ్ కూడా ప్రారంభించలేదు. వైఎస్సార్సీపీ నాయకులు స్వయంగా రంగంలోకి దిగి, మత్స్యకారులను కాపాడాలని డిమాండ్ చేసే వరకు స్థానిక ఎమ్మెల్యే కానీ, ఉన్నతాధికారులు కానీ పట్టించుకున్న పాపాన పోలేదు. స్థానిక ఎంపీ భరత్ వీకెండ్ లో ఎంజాయ్ చేయడానికి హైదరాబాద్ వెళ్లిపోయాడు. రాత్రయిపోయింది.. అంటూ ఆర్డీఓ, అవకాశం ఉన్నంత వరకు గాలిస్తాం.. అంటూ కలెక్టర్ ఇస్తున్న బాధ్యతారాహిత్య స్టేట్మెంట్లు చూస్తుంటే మత్స్యకారుల జీవితాలపై వీరికి ఉన్న నిర్లక్ష్యం అర్థమవుతోందన్నారు.

**పట్టించుకోని కూటమి నాయకులు**

రాష్ట్ర హోంమంత్రి అనిత బాధితులను నేరుగా పరామర్శించాల్సింది పోయి, తాపీగా వీడియో కాల్ మాట్లాడి మమ అనిపించారు. విశాఖ ఎంపీ భరత్ వీకెండ్ వస్తే చాలు హైదరాబాద్ వెళ్లిపోతున్నారు. ఇంత పెద్ద ప్రమాదం జరిగి మత్స్యకారులు గల్లంతైనా ఆయన అందుబాటులోకి రాలేదు. సంబంధిత అధికారులు, వ్యవస్థలను అప్రమత్తం చేయలేదు. అన్నీ తానే అయి ప్రభుత్వాన్ని నడిపిస్తున్నట్టు ఫీలయ్యే మంత్రి లోకేష్ కూడా మత్స్యకారుల ఆచూకీ గల్లంతు కావడంపై ఇప్పటివరకు స్పందించలేదు, పట్టించుకోలేదు. స్థానిక ఎమ్మెల్యే జనసేన పార్టీకి చెందిన వ్యక్తి అయినా, ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సైతం ఈ దారుణంపై నోరు మెదపకపోవడం దారుణమని వాసుపల్లి దుయ్యబట్టారు.

**టెక్నికల్ వ్యవస్థల ధ్వంసం**

వాతావరణం అనుకూలించక బోట్లు పనిచేయకపోవడంతో మత్స్యకారులంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ దేవుడిని ప్రార్థించారు. ఈ ప్రమాదంలో ఆరుగురు మత్స్యకారులు గల్లంతయ్యారు. అయితే, ఈదుకుంటూ వస్తున్న ఒక మత్స్యకారుడిని ఒక చైనా బోటు గమనించి రక్షణ కల్పించి ఒడ్డుకు చేర్చింది. గల్లంతైన మిగిలిన ఆరుగురిని వెతకడం చేతగాని మంత్రి అచ్చెన్నాయుడు.. అదృష్టవశాత్తు చైనా బోటు వల్ల బతికొచ్చిన వ్యక్తిని "మేమే రక్షించాం" అని డబ్బా కొట్టుకోవడం, గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు. గత వైఎస్సార్సీపీ హయాంలో ఫిషింగ్ హార్బర్‌లో ప్రమాద సంకేతాలకు సంబంధించిన టెక్నికల్ వ్యవస్థలు సక్రమంగా పనిచేసేవి. ఏదైనా బోటు మునిగిపోయే పరిస్థితి వస్తే వెంటనే హార్బర్‌లో సిగ్నల్స్ రావడం, పొగ రావడం జరిగేది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ టెక్నికల్ వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేశారు, అవి ఇప్పుడు పనిచేయడం లేదు. ప్రమాదం జరిగిన వెంటనే హుటాహుటిన ఛాపర్లు, స్పీడ్ బోట్లను రంగంలోకి దించి, ఎంత రాత్రయినా మత్స్యకారులను సురక్షితంగా వెతికి తెచ్చేవారు.

కానీ చంద్రబాబు నాయుడుకు మాత్రం కేవలం విశాఖ బీచ్‌లలో బీచ్ షాక్స్ పేరుతో మద్యం అమ్ముకుని కాసులు దండుకోవడంపై ఉన్న శ్రద్ధ, మత్స్యకారుల జీవితాలను కాపాడటంపై లేదు. ఈ కూటమి ప్రభుత్వంలో మత్స్యకారులకు గుర్తింపు లేదు, వారి ప్రాణాలకు విలువ కూడా లేదు. ఈ ప్రభుత్వం కేవలం సూటు, బూటు వేసుకున్న డబ్బున్న వారి రక్షణ, సౌకర్యాల కోసమే పనిచేస్తోంది. గల్లంతైన మత్స్యకారులలో ఒకరికి ఇటీవలే వివాహం జరిగింది, మరొకరి భార్య గర్భవతిగా ఉన్నారు, మరికొందరికి చిన్న చిన్న పిల్లలున్నారు. వారి కుటుంబాల కష్టాలు తలుచుకుంటే మనసు తరుక్కుపోతోంది. సమాచారం అందిన వెంటనే ప్రభుత్వం, అధికారులు సమన్వయంతో పనిచేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జరిగిన ప్రమాదమే. వైఎస్సార్సీపీ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడానికి చూపిస్తున్న శ్రద్ధలో పదో వంతు శ్రద్ధ మత్స్యకారులను కాపాడటంలో చూపించి ఉంటే ఈరోజు ఇంతమంది గల్లంతయ్యేవారు కాదు. ఇప్పటికైనా ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన అన్ని శక్తులను రంగంలోకి దించి గల్లంతైన ఆరుగురు మత్స్యకారులను వెతికి తీసుకురావాలి, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమ లో రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ విభాగం అధ్యక్షులు బోలవరపు జాన్ వెస్లీ, పార్టీ నాయకులు రెయ్యి డేవిడ్ రాజు, గనగళ్ల రామరాజు, లండ రమణ, సనపల రవీంద్ర, బిపిన్ జైన్, దొడ్డి బాపు ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.


# టెక్కలి క్రికెట్ క్రీడాకారునికి గొప్ప అవకాశం

### బీసీసీఐ ఎమర్జింగ్ మెన్స్ క్రికెట్ టోర్నమెంట్లో స్థానం



**టెక్కలి జూలై 6 జయ జయహే**

శ్రీకాకుళం జిల్లా టెక్కలి కి చెందిన క్రికెట్ క్రీడాకారుడు త్రిపురాన విజయ్ కు మంచి అరుదైన అవకాశం వచ్చింది, బీసీసీఐ నిర్వహిస్తున్న ఎమర్జింగ్ మెన్స్ క్రికెట్ టోర్నమెంట్లో 2026 కు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ తరపున ఎంపిక చేశారు, బిసిసిఐ హెడ్ ఆఫీసు నుంచి వివిఎస్ లక్ష్మణ్ ఉత్తర్వులు జారీ చేశారు, విజయ్ ఈ నెల 6 నుంచి 24 వరకు బెంగుళూరులో జరగనున్న క్రికెట్ టోర్నమెంట్ లో ఆడనున్నారు, విజయ్ ఐపీఎల్ 2026 క్రికెట్లో అత్యంత ప్రతిభతో ఆ డిన సంగతి విధితమే, సిక్కోలు క్రీడాకారునికి అవకాశం రావడం పలువురు క్రికెట్ అభిమానులు హ ర్షం వ్యక్తం చేస్తున్నారు.


TELUGU BOOK OF RECORDS - INTERNATIONAL
An ISO Certified Organization
APPRECIATION CERTIFICATE
Presented with Pride to
Mr. K.N.S.RAGHAVENDRA BABU
In recognition of your outstanding commitment to environmental conservation and social responsibility.
Your dedicated participation in the World Environment Day Plantation Awareness Initiative, conducted on 5 June 2026, is highly appreciated.
As part of this noble campaign, you actively planted saplings in your local area and shared photographic evidence in support of the environmental awareness movement organized by Telugu Book of Records. International
Your sincere efforts, enthusiasm, and commitment to promoting a greener and healthier environment through the 365-Day Environmental Awareness Program have contributed significantly toward inspiring others to protect and preserve nature for future generations.
The Telugu Book of Records proudly acknowledges and appreciates your valuable contribution to environmental sustainability and community awareness.
Authorized By
Dr. T. V. Ashok Kumar, TBR Jury Member
Dr. Chintapatla Venkata Chary, Founder & Chairman, Telugu Book of Records – International
WORLD ENVIRONMENT DAY 5 JUNE 2026
Certificate No. : 1002
Date of Issue : 25-06-2026
Place : Hyderabad

## పర్యావరణ పరిరక్షణలో యువకుడి విశిష్ట సేవ

### తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో రాఘవేంద్రబాబు పేరు

**పెరవలి, జూలై 6, జయ జయహే :**



పర్యావరణ పరిరక్షణకు విశేష కృషి చేసిన కోడూరి నాగ సూర్య రాఘవేంద్రబాబుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ -- ఇంటర్నేషనల్ సంస్థ ప్రశంసా పత్రం అందజేసింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన మొక్కలు పెంపకం చైతన్య కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటి, పర్యావరణ అవగాహన కల్పించడంలో ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ ఈ ప్రశంసా పత్రం ప్రదానం చేశారు. రాఘవేంద్రబాబు గత కొంతకాలంగా పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం మరియు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. 365 రోజుల పర్యావరణ అవగాహన కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయడంతో పాటు ప్రజల్లో పర్యావరణ చైతన్యం పెంపొందించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, యువత మరియు సామాజిక కార్యకర్తలు రాఘవేంద్రబాబును అభినందించారు. భవిష్యత్తులో కూడా సమాజ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ పర్యావరణ పరిరక్షణకు మరింత కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## 'మావిగన్' పేరుతో జగన్ మరో మోసం

### గుంటూరు టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య

**గుంటూరు, జూలై 6, జయ జయహే**



మావిగన్ పేరుతో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని టీడీపీ గుంటూరు బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య ఆరోపించారు. ఒకప్పుడు అమరావతే రాజధాని అని ఒప్పుకున్న జగన్ , అధికారంలోకి వచ్చాక మాట మార్చి మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని గందరగోళంలోకి నెట్టారని పేర్కొన్నారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాలను అవమానించారని, ఐదేళ్లు అమరావతిని పట్టించుకోకుండా, అభివృద్ధిని ఆపేసి ఇప్పుడు ఎన్నికల ముందు మళ్లీ అమరావతి పేరుతో రాజకీయాలు చేయాలని చూస్తున్నారన్నారు. అమరావతిని వ్యతిరేకించిన వ్యక్తే ఇప్పుడు "అమరావతి వెర్సెస్ మావిగన్" అంటూ కొత్త డ్రామా మొదలు పెట్టారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు అన్నీ మర్చిపోయారని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనుకుంటున్నారని కానీ ప్రజలు గతాన్ని మర్చిపోరని, ప్రజా రాజధాని నిర్మాణం ఆపింది ఎవరు...రైతులపై అక్రమ కేసులు పెట్టింది ఎవరు...పెట్టుబడిదారుల నమ్మకం దెబ్బతీసింది ఎవరు...అనే ప్రశ్నలకు జగన్మోహన్ రెడ్డి సమాధానం చెప్పాల్సి ఉందన్నారు. కానీ ప్రజలకు కావాల్సింది ఒకరి భవిష్యత్ కాదు.ఈ రాష్ట్ర భవిష్యత్.అమరావతి కేవలం ఒక ప్రాంతం కాదు.అది ఐదు కోట్ల ఆంధ్రుల ఆశయం.దాన్ని అడ్డుకున్న వాళ్లు ఇప్పుడు దాని పేరుతో ఓట్లు అడగడం రాజకీయ అవకాశవాదం.మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాజధాని విషయంలో ఒక్కసారి కాదు, ఎన్నోసార్లు మాట మార్చారని దుయ్యబట్టారు. ఇప్పుడు కొత్త నినాదం మొదలు పెట్టినా పాత మోసాలను ప్రజలు మర్చిపోరని, అమరావతిని అడ్డుకున్న వైసిపి నాయకులు చరిత్ర హీనులుగా మిగిలిపోతారని లక్ష్మయ్య హెచ్చరించారు.

## వృద్ధ దంపతులకు అండగా మాదారపు కుటుంబం

**శ్రీకాకుళం (జయ జయహే )**

స్థానిక బొందలీపురానికి చెందిన, గంధం రవికుమార్ ప్రస్తుతం క్యాన్సర్ వ్యాధితో తీవ్రంగా పోరాడుతుండగా, భార్య గంధం లక్ష్మి తులసి, ఒక కిడ్నీతో ఎన్నో ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి దీన స్థితిని తెలుసుకున్న, మాదారపు డేవిడ్, భార్య సౌందర్యలు ముందుకువచ్చి, వైద్యఖర్చుల నిమిత్తం కొంత నగదుని అందజేశారు. అనంతరం మాదారపు వెంకటేష్, కుమారరుడు డేవిడ్ మాట్లాడుతూ ఇప్పటికే ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్న ఈ కుటుంబం, తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను కూడా ఎదుర్కొంటోందని, రోజువారీ అవసరాలు తీర్చుకోవడమే కాకుండా, వైద్య ఖర్చులను భరించడం కూడా వారికి చాలా కష్టంగా మారిందన్నారు. మా తనయుడు, చిరంజీవి యోధ మొదటి జన్మదినం సందర్భంగా వృద్ధ దంపతుల వైద్య, జీవనానికి చిరుసాయం చేశామని, ఈ విషయాన్ని రెడ్ క్రాస్ ప్రతినిధి నంది.ఉమాశంకర్ ద్వారా తెలుసుకున్నామని, అలాగే ఆర్ అండ్ బి విశ్రాంత భవనం ఎదురుగా, రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నడుపబడుతున్న శాంతా కళ్యాణ అనురాగ నిలయంలో వృద్ధులకు, పిల్లలకు అన్నవితరణ చేపట్టి, వారి మధ్య జన్మదినం వేడుకలు జరుపుకున్నామని తెలిపారు. ఈ సేవ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ప్రతినిధి నంది.ఉమాశంకర్, వృద్ధ దంపతులు, అనురాగ నిలయ నిర్వాహకులు, చిన్నారులు, మాదారపు వెంకటేష్ కుటుంబ సభ్యులు, మాదారపు డేవిడ్, సౌందర్య, చిరంజీవి యోధ, కుమారి మాదారపు.దివ్య తదితరులు పాల్గొన్నారు.



## ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల శ్రమను

# దోచుకుంటున్న కాంట్రాక్టర్లు





### ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ బ్రతుకులు దళారీల చేతుల్లోనా...?

### ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్

**విజయనగరం, జూలై 6, జయ జయహే**

ఏళ్ల తరబడి ఆర్టీసీ సేవలను తమ శ్రమతో నడిపిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం కలిసి పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ తీవ్రంగా విమర్శించారు. ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం విజయనగరం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఎపిఎస్ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో రాష్ట్ర పబ్లిక్ సెక్రటరీ అనకాపల్లి అశోక్ నాయకత్వంలో నిరసన ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బుగత అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఒక విధమైన వేతనాలు, సౌకర్యాలు కల్పిస్తూ, ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగులను మాత్రం రెండో రకపు పౌరుల్లా చూడటం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం అనే సూత్రాన్ని ప్రభుత్వం తుంగలో తొక్కుతోందని ఆరోపించారు. ఉద్యోగ భద్రత లేకుండా, కనీస వేతనాలు లేకుండా, సామాజిక భద్రతా పథకాలకు దూరంగా వేలాది మంది కార్మికులను పనిచేయించడం ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిదర్శనమని ఆయన మండిపడ్డారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం ద్వారా నేరుగా బ్యాంకు ఖాతాల్లో వేతనాలు ప్రతి నెల 7 వ తేదీలోపు చెల్లించకుండా, మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు, పీఎఫ్, ఈఎస్ఐ, వారాంతపు సెలవులు, జాతీయ సెలవులు, ఉద్యోగ భద్రత వంటి కనీస హక్కులను కూడా కల్పించకపోవడం దారుణమన్నారు. పదేళ్ళ నుంచి పదిహేనేళ్లుగా సేవలందిస్తున్న కార్మికులను ఇప్పటికీ తాత్కాలిక ఉద్యోగులుగానే కొనసాగించడం ప్రభుత్వ వైఫల్యమని విమర్శించారు. విద్యుత్ బస్సుల నిర్వహణను ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగించడం ద్వారా ఆర్టీసీని క్రమంగా ప్రైవేటీకరణ దిశగా నెట్టివేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు లాభాలు చేకూర్చే విధానాలను అమలు చేస్తోందని అన్నారు. ఈ విధానాల వల్ల అనేక మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉపాధి కోల్పోయే ప్రమాదంలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రిక్రూట్‌మెంట్ ప్రక్రియల్లో దీర్ఘకాలంగా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, సీనియారిటీ ఆధారంగా ఉద్యోగాల్లో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు, అద్దె బస్సు డ్రైవర్లు, ఆన్‌కాల్ డ్రైవర్లు తో సహా అన్ని వర్గాల కార్మికులకు న్యాయమైన వేతనాలు, సంక్షేమ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల 16 న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కారం చేయలేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికుల సహనాన్ని బలహీనతగా భావిస్తే ప్రభుత్వం భారీ ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు, జనరల్ సెక్రెటరీ కుమార్, శివ, వెంకటేష్, ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



## గల్లంతైన మత్స్యకారుల కోసం హెలికాప్టర్లు, నౌకలతో ముమ్మర గాలింపు

### రెండో రోజూ కనిపించని ఆచూకీ

**విశాఖపట్నం, జూలై 6, జయ జయహే**

గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం భారత తీర రక్షక దళం, భారత నౌకాదళం సమన్వయంతో సముద్రంలో విస్తృత స్థాయిలో గాలింపు, సహాయక చర్యలను కొనసాగిస్తున్నాయి. సమాచారం అందిన వెంటనే భారత తీర రక్షక దళానికి చెందిన ఐసీజీఎస్ కనక్ లతా బరువా, ఐసీజీఎస్ వీర నౌకలను గాలింపు ప్రాంతానికి మోహరించారు. అలాగే మూడు హెలికాప్టర్లను రంగంలోకి దింపి సముద్రంలో విస్తృతంగా గాలింపు నిర్వహిస్తున్నారు. ఈ చర్యలను విశాఖపట్నంలోని రీజినల్ ఆపరేషన్స్ సెంటర్ నిరంతరం పర్యవేక్షిస్తోంది. అదే విధంగా భారత నౌకాదళం ఈస్టర్న్ నేవల్ కమాండ్ కూడా సహాయక చర్యల్లో భాగస్వామ్యమై రెండు యుద్ధ నౌకలు, ఒక సీ కింగ్ హెలికాప్టర్, ఒక అడ్వాన్సడ్ లైట్ హెలికాప్టర్ ను మోహరించి గాలింపు కార్యక్రమాలను కొనసాగిస్తోంది. ప్రస్తుతం సముద్రంలో బలమైన గాలులు, ఎత్తైన అలల కారణంగా ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ, గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ లభించే వరకు నౌకలు, హెలికాప్టర్లతో రెస్క్యూ ఆపరేషన్‌ను నిరంతరంగా కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## జిందాల్ రైతులు అందరికి న్యాయం చెయ్యండి

### భీశెట్టి బాబ్జి

**ఎస్ కోట (జయ జయహే)**

చాలా సంవత్సరాలనుండి అనేక సమస్యలతో రోడ్డెక్కిన జిందాల్ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తగిన న్యాయం చేసిందని రైతులకోసం పోరాటం చేసిన ప్రజా ప్రతినిధులకు, ప్రజా సంఘాలకు లోక్ సత్తా నుండి అభినందనలు తెలియచేస్తున్నామని ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు సోమవారం ఎస్. కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ని లోక్ సత్తా పార్టీ నాయకుల బృందం తో కలిసి జిందాల్ కర్మాగారం కోసం జరిగిన భూ సేకరణ లో అనేక అవకతవకలు జరిగిన విషయాలు లోక్ సత్తా అధినేత డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ రాష్ట్ర శాసన సభలో చర్చ చేసి అధికారులు, చేసిన తప్పులు బయటకు తీసుకురావడం జరిగిందని అప్పటి లో జరిగిన అవకతవకల పై ఇప్పటి ప్రభుత్వం తగిన ప్రకటన చెయ్యకపోవడం ఆవేదన



కలిగించిందని, అమ్ముపాలెం గ్రామానికి చెందిన కొంతమంది గిరిజన రైతుల భూ పరిహారం కొంతమంది అక్రమంగా తినేసారని ఫిర్యాదు చేసినా ఎందుకు పట్టించుకోలేదని, భూ సేకరణ లో జరిగిన జిందాల్ బినామీలపై ఎందుకు నేటికీ చర్యలు తీసుకోలేదని, పీఓటి ల పై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, పల్లా ఆడివేసు, ఆంతోని, కోన సీతమ్మ కుటుంబం లాంటి వారి కి భూ సేకరణ లో తీరని అన్యాయం జరిగిందని, చాలామంది కి పేమెంట్ లో అవకతవకలు జరిగాయని,జిందాల్ భూమి పూజకు ముందు రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీ ఇచ్చిన హామీలు అమలు జరిగేలా చూడాలని లోక్ సత్తా రైతుల తరపున ఉంటుందని భీశెట్టి బాబ్జి ఎమ్మెల్యే లలిత కుమారి దృష్టి కి తీసుకు వచ్చి వినతి పత్రం అందచేసారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గం అధ్యక్షుడు కాండ్రేగుల ప్రసాద్, పల్లా మోహన్, దొడ్డి నాగార్జున తదితరులు ఉన్నారు

# అరకులో ఇంత ఘోరమా....!

### - చీకటి పడితే వీధి దీపాలే లేవు

### - రహదారుల నిండా పిచ్చి మొక్కలు

### - అధికారులు ఏం చేస్తున్నారన్న మాజీ మంత్రి బాలరాజు

**అరకులోయ, జూలై 6, జయ జయహే:**





ప్రపంచ పర్యాటక పటంలో అందంగా కనిపించే అరకులోయ. కానీ అక్కడి రోడ్ల పరిస్థితి చూస్తే పర్యాటకులు షాక్ అవ్వాల్సిందేనని మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డివైడర్లలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చీకటిగా ఉన్న వీధి దీపాలను జూమ్ చేసి చూపినా అధికారులకు కనిపించడం లేదన్నారు. పర్యాటకుల కోసం రూ. కోట్ల విలువైన ప్రకటనలు యిస్తున్నారే కానీ పట్టణంలో కనీస వసతులు కల్పించే దిశగా అధికారుల చర్యలు లేవని మండిపడ్డారు. అరకులో ప్రధాన రహదారుల డివైడర్లలో అందమైన మొక్కలు ఉండాల్సింది పోయి.. ప్రమాదకరమైన వయ్యారి భామ కలుపు మొక్కలు రాజ్యమేలుతున్నాయని ఆరోపించారు. రాత్రి అయ్యిందంటే చాలు.. అరకులోయలో చీకటి సామ్రాజ్యం రాజ్యమేలుతుందని, కనీసం వీధి దీపాలు కూడా వెలగని దుస్థితి కారణంగా అరకు బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. అరకు కాఫీ, అరకు పర్యాటక ప్రచారాలకు ఇచ్చే ప్రాధాన్యత కనీస సౌకర్యాల కల్పనపై ఈ ప్రభుత్వం ఎందుకు దృష్టి పెట్టడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందిస్తుందా? అరకు అందాన్ని కాపాడుతుందా? అరకులోయ వాసుల గోడు ఎప్పుడు వింటారు? అరకులోయపై నిర్లక్ష్యం ఎందుకు?వెంటనే అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించాలని మాజీ మంత్రి బాలరాజు తన దైన శైలిలో కోరారు.



## అగనంపూడి పశు వైద్యశాలలో ఘనంగా జూనోసిస్ డే

**అగనంపూడి, జూలై 6, జయ జయహే**

అగనశీపూడి పశు వైద్యశాలలో జూనోసిస్ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెటర్నరీ అసిస్టెంట్ సివిల్ సర్జన్ డాక్టర్ పువ్వులు లావణ్య ను కూటమి నాయకులు ఘనంగా సన్మానించారు. 85 వార్డు ఇంచార్జ్ కార్పొరేటర్ ఇల్లపు ప్రసాద్ మాట్లాడుతూ పెంపుడు కుక్కలు ఎవరినైనా కరిచిన ముందస్తు జాగ్రత్తగా రాబిస్ వ్యాధి రాకుండా జూనోసిస్ టీకాలు వేయించుకోవడం చాలా మంచిదన్నారు. పశువైద్యశాల అభివృద్ధి కొరకు ఫార్మా కంపెనీల నుండి స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ద్వారా నిధులు తీసుకురావడానికి కృషి చేస్తానని అన్నారు. పశువుల డాక్టర్ పువ్వుల లావణ్య మాట్లాడుతూ పెంపుడు జంతువులే కదా అని విస్మరిస్తే మనం ప్రమాదంలో పడినట్టేనని, వీటి నుంచి కూడా వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, జంతువుల నుండి పశువులకు సోకే వ్యాధులను జెనీసస్ గా పేర్కొన్నారు. వ్యాధులు సంక్రమించకుండా అవగాహన పెంపొందించుకోవడం జాగ్రత్త తీసుకోవడం ఎంతో అవసరమని ప్రముఖ శాస్త్రవేత్త లూయిస్ పాశచర్ పేర్కొన్నారని, మొదటిసారిగా 1985 జూలై 6న పిచ్చి కుక్కకు కాటు గురైన బాలుడికి నిరోధక టీకా ఇవ్వడం ద్వారా కాపాడుకోగలిగారన్నారు. దీంతో అప్పటినుంచి ఏటా జూలై 6న జునోసిస్ దినోత్సవం గా జరుపుకుంటున్నారని చెప్పారు. ఏ డి సి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ సభ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 85 వార్డు తెలుగుయువత అధ్యక్షులు బండారు చందు రమేష్, బిజెపి అగనంపూడి మండల అధ్యక్షులు కోసూరి తాతారావు, జనసేన పార్టీ నాయకురాలు పట్టా పైడి రత్నం, స్థానిక పశువైద్యశాల సిబ్బంది పామల అప్పలరాజు, బి రమణమ్మ, లావణ్య, కుక్కలను తీసుకువచ్చిన యజమానులు పాల్గొన్నారు,




## తీరానికి సురక్షితంగా చేరుకున్న మత్స్యకారుడు కర్రి చిన్న

### నేవీ హెలికాప్టర్ సాయంతో ఐఎన్ఎస్ డేగాకు

### వైద్య చికిత్స నిమిత్తం కిమ్స్ ఐకాన్ కు తరలింపు

### నేవీ, కోస్ట్ గార్డ్ అధికారులతో రక్షణ చర్యలను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్

**విశాఖపట్నం, జూలై 6, జయ జయహే**

సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల కోసం కొనసాగుతున్న గాలింపు చర్యల్లో భాగంగా మత్స్యకారుడు కర్రి చిన్న సోమవారం సాయంత్రం సురక్షితంగా తీరానికి చేరుకున్నాడు. నేవీ హెలికాప్టర్ సాయంతో ఆయనను సాయంత్రం సుమారు 7 గంటల ప్రాంతంలో ఐఎన్ఎస్ డేగాకు రక్షణ సిబ్బంది తీసుకువచ్చారు. అక్కడ వైద్యులు ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించగా, చిన్నా ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వెల్లడించారు. అనంతరం మరిన్ని వైద్య పరీక్షలు, అవసరమైన చికిత్స కోసం అంబులెన్స్‌లో షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చిన్నాను ఆయన భార్య, కుటుంబ సభ్యులు కలిసి పరామర్శించారు. ఈ మొత్తం ప్రక్రియలో జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ నేవీ, కోస్ట్ గార్డ్ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం వహిస్తూ రక్షణ చర్యలను పర్యవేక్షించారు. గల్లంతైన మిగిలిన మత్స్యకారుల ఆచూకీ లభించే వరకు గాలింపు చర్యలు నిరంతరంగా కొనసాగుతాయని తెలిపారు. ప్రాథమిక వైద్య పరీక్షల అనంతరం చిన్నాను మెరుగైన పరీక్షలు, వైద్యం కోసం అంబులెన్స్ లో షీలా నగర్ కిమ్స్ ఆసుపత్రి కి తరలించారు.

## గుండె పోటుతో వైఎస్సార్‌సీపీ నేత తిరుపతిరావు మృతి

**ముంచంగిపుట్టు, జయ జయహే**



మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత సొనియా తిరుపతిరావు (61) గుండె పోటు వచ్చి మృతి చెందారు. సోమవారం తిరుపతిరావు ఇంటి వద్ద హఠాత్తుగా గుండె పోటు వచ్చి పడిపోయారు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక సీహెచ్‌సీకి హుటాహుటినా తీసుకొని వచ్చారు. వైద్యులు పరీక్షలు జరిపేలోపే కన్నుమూశారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఎంపీపీ సీతమ్మ, వైస్ ఎంపీపీ భాగ్యవతి, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ అరబిరు జగబంధు, వైఎస్సార్‌సీపీ, వైసిపి మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మండల నేతలు తిరుపతి మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అందరితో మంచిగా ఉంటూ, వైఎస్సార్‌సీపీ నిర్వహించే ప్రతి కార్యక్రమంలోనూ ఎంతో చురుగ్గా పాల్గొంటూ, నిత్యం జగన్‌ను అభిమానించే వైఎస్సార్‌సీపీ నేతను ఇలా కోల్పోవడం పార్టీకి తీరని లోటని వైఎస్సార్‌సీపీ మండల నేతలు విచారం వ్యక్తం చేశారు.

# ఏ.పి.రిజిస్ట్రేషన్ శాఖలో జి.ఓ.నెం.396 రద్దు చేయాలి





### దస్తావేజు లేఖర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టి కి తీసుకెళ్ళాలి-

### స్థానిక ఎమ్మెల్యే, సబ్ రిజిస్ట్రార్ ను కలిసిన దస్తావేజు లేఖరుల సంఘం

**చోడవరం : జూలై 6 జయ జయహే**

ఏపీ రిజిస్ట్రేషన్ శాఖలో కొత్తగా ప్రవేశపెట్టనున్న జీ.వో నెం. 396 రద్దు చేయాలని దస్తావేజు లాకర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు వారు నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ధన్యవాదములు దానిలో భాగంగా సోమ-ంవారం దస్తావేజు లేఖరుల సంఘం ప్రతినిధులు చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు కు, సబ్ రిజిస్టర్ గీత లక్ష్మి కి వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్షుడు వద్దాది రమేష్ మాట్లాడుతూ కొన్ని వందల సంవత్సరాల నుంచి ఇదే వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న దస్తావేజు లేఖరుల కుటుంబాలు జీవనోపాధిని కోల్పోయే ప్రమాదం ఉందని తెలియజేశారు. ప్రతిష్టాత్మకమైన ప్రభుత్వ రిజిస్ట్రేషన్ శాఖలో పి.పి.పి విధానంలో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు (ఆర్.ఎస్.కె) ద్వారా రిజిస్ట్రేషన్ సేవలు అందించాలనే అనాలోచిత చర్యలు కారణంగా లక్షలాది దస్తావేజు లేఖర్ల కుటుంబాలు రోడ్డున పడతారని అన్నారు. నామ మాత్రపు సర్వీసు చార్జీలతో అనుభవజ్ఞులైన దస్తావేజు లేఖరులు, ... దస్తావేజులు తయారు చేయడంలోనూ, రిజిస్ట్రేషన్ ప్రక్రియ సజావుగా సాగేందుకు కక్షిదారులకు ప్రభుత్వానికి వారధిలా పనిచేస్తున్న విషయాన్ని తెలిపారు. ప్రభుత్వం దృష్టికి దస్తావేజు లేఖరుల సమస్యలను తీసుకెళ్లి జీవో నెంబర్ 396 రద్దు చేసేందుకు సహకరించాలని కోరారు. జి.ఓ. నెం.396 రద్దు కై డిమాండ్ చేస్తూ రెండు రోజులు పెన్ డౌన్ (విధులు నిలుపుదల) చేస్తున్నట్లు తెలిపారు. వందల సంవత్సరాలు గా దస్తావేజు వృత్తిలో,... ప్రజలకు, ప్రభుత్వానికి నమ్మకమైన సేవలు అందిస్తూ ఎటువంటి పారితోషకాలు తీసుకోకుండా పని చేస్తున్న మాకు తగిన న్యాయం చేసి లైసెన్సులు మంజూరు చేయ్యాలని వారు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బొబ్బిలి చంద్రశేఖర్, సెక్రటరీ కోరుకొండ శ్రీనివాసరావు, డి.సీతారామయ్య, వింజమూరి శంకర్, కె. నారాయణరావు, పి. శ్రీనివాసరావు ఇతర దస్తావేజు లేఖరులు, సహాయకులు, డిటిపి ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆరు రోజుల పాటు ప్రధాని విదేశీ పర్యటన

### ఇండోనేషియాకు చేరుకున్న ప్రధాని మోడీ

### గగనతలంలో యుద్ధవిమానాల ఎస్కార్ట్

### ఘనంగా స్వాగతం పలికిన ఇండోనేసియా అధ్యక్షుడు

**జయ జయహే**

ప్రధాని నరేంద్రమోదీ ఇండోనేసియా పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు అరుదైన గౌరవం లభించింది. మోదీని ఆ దేశం ప్రత్యేకంగా స్వాగతించింది. ఆయన ప్రయాణిస్తున్న విమానం జకార్తా గగతనలంలోకి ప్రవేశించగానే.. ఆ దేశ వైమానిక దళానికి చెందిన యుద్ధ విమానాలు ఎస్కార్ట్‌గా వచ్చాయి. ప్రధాని మోదీ విమానాశ్రయానికి చేరుకోగానే ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో స్వాగతం పలికారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ సోషల్ మీడియాలో పంచుకున్నారు. తాను జకార్తా చేరుకున్నానని.. ప్రబోవో సుబియాంతో స్వాగతం పలికిన తీరు తనను ఎంతగానో కదిలించిందని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో ఇరు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత పెంచే లక్ష్యంతో ముందుకు వెళ్తామన్నారు. ఇండోనేసియాలో పర్యటన ముగిసిన అనంతరం ప్రధాని మోదీ జులై 8న ఆస్ట్రేలియా చేరుకుంటారు. జులై 9న అక్కడ జరిగే 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచి న్యూజిలాండ్‌కు వెళ్లనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇవాళ ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల




పర్యటనకు బయలుదేరారు. జులై 6 నుంచి 11 వరకు కొనసాగనున్న ఈ ఆరు రోజుల పర్యటనలో ఆయా దేశాల అధినేతలతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు మోదీ. ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని సమీక్షించడంతో పాటు వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, ఇండో-పసిఫిక్ ప్రాంతీయ సహకారం వంటి అంశాలపై కీలకంగా చర్చించనున్నారు. అలాగే భారతీయ ప్రవాసులను ఉద్దేశించి ప్రసంగించడంతో పాటు ప్రముఖ వ్యాపారవేత్తలతోనూ సమావేశం కానున్నారు. పర్యటనకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ ఓ కీలక ప్రకటన విడుదల చేశారు. ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ పర్యటనలు భారత యాక్ట్ ఈస్ట్ పాలసీ, మహాసాగర్ విజన్‌కు మరింత బలం చేకూరుస్తాయని ఆయన తెలిపారు. స్వేచ్ఛాయుత, బహిరంగ, సమ్మిళిత ఇండో-పసిఫిక్ ప్రాంత నిర్మాణంపై భారత్ నిబద్ధతను ఈ పర్యటన మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రధాని మోదీ జులై 6 నుంచి 8 వరకు ఇండోనేషియాలో పర్యటించనున్నారు. ఆ దేశ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరుగుతోంది. ప్రధానిగా నరేంద్ర మోదీ నాలుగోసారి ఇండోనేషియాలో పర్యటిస్తున్నారు. జకార్తాలో అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతోతో ప్రధాని మోదీ సమావేశమై ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని సమీక్షించనున్నారు. అనంతరం భారతీయ ప్రవాసులను ఉద్దేశించి భారీ సభలో ప్రసంగించనున్నారు. అలాగే యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో ఉన్న యోగ్యకర్తలోని ప్రంబనన్ ఆలయ సముదాయాన్ని సందర్శించనున్నారు. ఇండోనేషియా పర్యటన అనంతరం జులై 8 నుంచి 10 వరకు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. అలాగే ఆ దేశ గవర్నర్ జనరల్ సామ్ మోస్టిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకోనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే ఇండియా-ఆస్ట్రేలియా సీఈఓల ఫోరంలో పాల్గొని ఇరు దేశాల ప్రముఖ పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. భారతీయ ప్రవాసులతోనూ ప్రత్యేకంగా సమావేశమవుతారు.ఆస్ట్రేలియాపర్యటన అనంతరం జులై 10, 11 తేదీల్లో న్యూజిలాండ్‌లో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఆ దేశ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరుగనుంది. మరోవైపు దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత న్యూజిలాండ్‌ను సందర్శిస్తున్న తొలి భారత ప్రధానమంత్రిగా మోదీ నిలవనున్నారు.

# నెరవేరిన 40 ఏళ్ల నాటి కల, తారు రోడ్డు నిర్మాణంతో తీరిన కష్టాలు

**మక్కువ, జూలై 7( జయ జయహే)**

నాలుగు దశాబ్దాలుగా తమ గ్రామానికి తారు రోడ్ నిర్మాణం జరగాలన్న మక్కువ మండలం డి. శిర్లాం గ్రామ ప్రజలకు కూటమి ప్రభుత్వం చొరవతో ఎట్టకేలకు తారు రోడ్డు నిర్మాణం జరిగి కష్టాలు తీరాయి. మక్కువ మండలంలోని శివారు గ్రామమైన డి.శిర్లాం గ్రామ ప్రజలు గ్రామం విడిచి ఎటువైపు వెళ్ళాలన్నా కనీస రోడ్డు రహదారి సౌకర్యం లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండల కేంద్రమైన మక్కువ రావాలన్న, ప్రస్తుతం జిల్లా కేంద్రమైన పార్వతీపురం ప్రాంతానికి వెళ్లాలన్నా కనీస రోడ్డు సౌకర్యాలు లేక ఎన్నో కష్టనష్టాలకు గురయ్యారు. ఈ నేపథ్యంలో గ్రామానికి రోడ్డు నిర్మించి ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపరచాలని ఆ గ్రామ ప్రజలు గత నాలుగు దశాబ్దాలుగా అధికారంలో ఉన్న ప్రభుత్వాలను, నాయకులను ఎన్నిసార్లు కోరిన అనేకసార్లు విన్నపాలు సమర్పించుకున్న ఎ టువంటి ప్రయోగం లేకపోయింది.దీంతో శిర్లాం గ్రామ ప్రజలు అడవి మధ్యలో జీవించినట్లుగానే రహదారి రవాణా సౌకర్యాల లేక, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించక నష్టాల పాలయ్యారు. 2014లో అప్పటి టిడిపి ప్రభుత్వం ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ఎవరో ముందుకు రాకపోవడంతో ఆ నిధులు రద్దు అయ్యాయి. అయితే 2022లో గత వైసీపీ ప్రభుత్వం హయాంలో డి.శిర్లాం గ్రామము నుండి పార్వతిపురం మండలంలోని కొత్తవలస వరకు తార్ రోడ్డు నిర్మాణానికి కోటి అరవై లక్షల రూపాయలు మంజూరయ్యాయి. దీంతో అధికారులు కాంట్రాక్టర్ ను నియమించి పనులు చేపట్టారు. అయితే వైసీపీ ప్రభుత్వం పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కు బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేసి వదిలి వెళ్లిపోయారు. దీంతో తారు రోడ్డు నిర్మాణ పనులు నాలుగు సంవత్సరాలుగా నిలిచిపోయి గ్రామ ప్రజలకు రోడ్డు





రవాణా సౌకర్యాలు దూరమయ్యాయి. ఈ నేపథ్యంలో 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఆ గ్రామ టిడిపి నాయకులు దాకేటి గౌరు నాయుడు ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు.శిర్లాం గ్రామ ప్రజల వెన్న పాలను పరిశీలించిన మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సంబంధిత రోడ్డు పనులు కాంట్రాక్టర్ తో మాట్లాడి పనులు పూర్తయిన వెంటనే బిల్లులు చెల్లించేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి సంధ్యారాణి హామీతో కాంట్రాక్టర్ పనులను తిరిగి ప్రారంభించారు. డి.శిర్లాం నుండి కొత్తవలస వరకు రెండు కిలోమీటర్ల రోడ్డుకు తారు రోడ్డు నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. గత 40 ఏళ్లుగా తమ గ్రామానికి తారు రోడ్డు నిర్మాణం జరగాలని తాము ఎన్నో కలలు కన్నామని నెరవేరలేదని, కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరకాలంలోనే మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సంధ్యారాణి కృషితో గ్రామానికి పక్కా తారు రోడ్డు నిర్మాణం పూర్తయిందని డి.శిర్లాం గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామ టిడిపి నాయకులు దాకేటి గౌరు నాయుడు మాట్లాడుతూ గ్రామ ప్రజలు 40 సంవత్సరాలుగా గ్రామానికి తారు రోడ్డు నిర్మాణం జరగాలని కన్న కలలు కూటమి ప్రభుత్వం లో మంత్రి సంధ్యారాణి చొరవతో పాటు మండల టిడిపి అధ్యక్షులు గుల్ల వేణుగోపాల్ నాయుడు కృషితో ప్రజల కల నెరవేరిందని తెలిపారు.శిర్లాం గ్రామం నుండి కొత్తవలస వరకు తారు రోడ్డు నిర్మాణం పూర్తి కావడం వలన జిల్లా కేంద్రానికి తమ ప్రజలు నేరుగా ప్రయాణం చేసేందుకు రవాణా సౌకర్యం ఏర్పడిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. అలాగే ప్రస్తుతం డి.శిర్లాం గ్రామము నుండి దబ్బగడ్డ మీదుగా మక్కువ మండలానికి వెళ్లే రోడ్డు నిర్మాణం మధ్యలో ఆగిపోయిందని ఆ రోడ్డు నిర్మాణం కూడా చేపట్టి పూర్తి చేయాలని ఆయన అధికారులు కోరారు.



## ఆశ కార్యకర్తలు బి.ఎల్వో విధులు నిర్వహించాలి

### రెవెన్యూ అధికారులు...

**చోడవరం జూలై 6, జయ జయహే**


ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియకు సంబంధించి బి.ఎల్.ఓ విధులు నిర్వహించాల్సిందిగా మండలంలోని ఆశా కార్యకర్తలకు సోమవారం నిర్వహించిన సమావేశంలో రెవెన్యూ అధికారులు ఆదేశించారు. దీనిపై ఆశ కార్యకర్తలు మాట్లాడుతూ ఇప్పటికే తమకు మోయలేనంత విధి భారం ఉందని, తాము ఉన్నత వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఈ విషయాలు తెలియపరుస్తామన్నారుప్రభుత్వ విధుల్లో బి.ఎల్.ఓ.ల కు సహకరిస్తామే తప్ప, ప్రత్యక్ష విధుల్లో పాల్గొన లేమని స్పష్టం చేశారు.




## రాష్ట్ర ఫ్యాప్టో ఉద్యమ ర్యాలీని విజయవంతం చేద్దాం

**అనకాపల్లి జూలై సోమవారం 6 జయ జయహే**

రాష్ట్ర ఫ్యాప్టో కార్యచరణ లో భాగంగా ఈనెల 14 తేదీన జిల్లా కేంద్రాలలో జరుగునున్న ర్యాలీ మరియు కలెక్టరేట్ వద్ద పికెటింగ్ కార్యక్రమం విజయవంతం చేయడానికి అనకాపల్లి లోని ఏపీటీఎఫ్ భవనంలో సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమం చైర్మన్ బోయిన చెన్నారావు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది . రాష్ట్ర ఫ్యాప్టో కో చైర్మన్ సిహెచ్ వెంకటేశ్వర్లు సభను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర పిలుపు మేరకు ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని అవసరమైతే కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో చట్టం తేవాలని చేయాలని 12వ సి ఆర్ సి కమిటీని వెంటనే నియమించాలని లేనియెడల 30% ఐ ఆర్ ను వెంటనే ప్రకటించాలని పెండింగ్లో ఉన్న 40ఏ లను వెంటనే విడుదల చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. అలాగే జిల్లా ఫ్యాక్టో చైర్మన్ మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన జరగబోయే ర్యాలీ కలెక్టరేట్ వద్ద పికెటింగ్ లో కి జిల్లా లోని ఉపాధ్యాయులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో వై సుధాకర్ వై శ్రీనివాసరావు వి శ్రీలక్ష్మి సిహెచ్ నాగేశ్వరరావు పీవీ శేషగిరిరావు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు



## పాఠశాలలు సందర్శించిన డీఈవో

**మాడుగుల జులై 7 జయ జయహే**

అనకాపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి డి అప్పారావు నాయుడు సోమవారం మాడుగుల మండలంలో గల వివిధ పాఠశాలలను సందర్శించారు. మండలంలో గల తాటిపర్తి గిరిజన ఆశ్రమ పాఠశాల, వీరనారాయణశీ, చింతలి ఉన్నత పాఠశాలలో సందర్శించి పరిశీలించారు. అయ్య పాఠశాలలో విద్యార్థులు హాజరు పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థులతో ముచ్చరించి పాఠశాల ద్వారా అందుతున్న ప్రభుత్వ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులు చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని నూరు శాతం అత్యధిక మార్పులతో ఉత్తీర్ణులయ్యే విధంగా జిల్లాకు మంచివే తేవాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరు క్రమశిక్షణ అవసరమని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓలు దేవుడమ్మ ఈశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చంపత్ రాయ్ రాజీనామా ఆమోదం

### అయోధ్య ట్రస్ట్ ప్రధాన కార్యదర్శిగా కృష్ణమోహన్

**జయ జయహే**

అయోధ్య విరాళాల చోరీ ఘటన నేపథ్యంలో శ్రీ రామజన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్టు ప్రధాన కార్యదర్శిగా కృష్ణ మోహన్ నియమితులయ్యారు. చంపత్ రాయ్ రాజీనామాను ఆమోదించిన ట్రస్టు.. ఆయన స్థానంలో తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా కృష్ణమోహన్‌కు బాధ్యతలు అప్పగించింది. ఈ విషయాన్ని ట్రస్టు కోశాధికారి గోవింద్ గిరి మీడియాకు వెల్లడించారు. అయోధ్య విరాళాల చోరీ వ్యవహారం వెలుగులోకి రావడంతో నైతిక బాధ్యత వహిస్తూ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్, సభ్యుడు అనిల్ మిశ్రా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. సోమవారం మధ్యాహ్నం నుంచి దాదాపు 3 గంటలకు పైగా కొనసాగిన ఈ సమావేశానికి ట్రస్ట్ చైర్మన్ నృత్యగోపాల్ దాస్‌తో పాటు తొమ్మిది మంది శాశ్వత సభ్యుల్లో ఏడుగురు హాజరు కాగా.. చంపత్ రాయ్, మిశ్రా మాత్రం హాజరు కాలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1,
BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com